



అనకాపల్లి విజయరామరాజుపేట రైల్వే వంతెన కింద నీటిలో నిలిచిపోయిన 104 వాహనం

రాయి క్వారీలు ధారాదత్తం

తెరవెనుక చక్రం తిప్పిన ఇద్దరు కూటమి నేతలు

- తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అనుచరుడితో గనుల శాఖకు దరఖాస్తు
- మామిడిపాలెం 109 సర్వే నంబరులో నల్లరాయి తవ్వకాల లీజు
- 10.18 హెక్టార్లను రెండుగా విభజించి కేటాయింపు
- మొక్కుబడిగా గ్రామసభ
- ప్రజల నుంచి అభ్యంతరాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు



మామిడిపాలెంలో నల్లరాయి క్వారీ కొండలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాకు అధికార కూటమికి చెందిన ఒక కీలక నేత చక్రం తిప్పడం, పొరుగు జిల్లాకు చెందిన మరో నేత వత్తాసు పలకడంతో నల్లరాయి క్వారీలను అడ్డగోలుగా లీజుకు ఇచ్చేశారు. గనులు, కాలుష్య నియంత్రణ మండలి, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారుల కనుసన్నల్లో చాపకింద నీరులా సాగిపోయింది. అనకాపల్లి మండలం మామిడిపాలెం సర్వే నంబరు 109 సర్వేలో నాలుగు హెక్టార్ల నల్లరాయి క్వారీ, ఇదే సర్వే నంబరులో ఆరు హెక్టార్లలో మరో నల్లరాయి క్వారీ లీజులను అడ్డగోలుగా అప్పగించిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

గత వైసీపీ ప్రభుత్వం గనుల లీజులో పారదర్శకతకు పాతరేసింది. అప్పట్లో జిల్లాకు చెందిన ఓ మంత్రి, తన అనుచర గణానికి నల్లరాయి క్వారీలన ధారాదత్తం చేసిన సంగతి తెలిసిందే. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గనుల లీజు పారదర్శకంగా జరుగుతుందని ప్రజలు భావించారు. ఇందుకోసం ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలులోకి తెచ్చింది. ఈ-వేలం లేదా ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో గనుల కేటాయింపులు జరుపుతున్నారు. ఈ-వేలానికి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే వేలం వేస్తారు. ఈ విధానంలో అస్మదీయులకు ఏకపక్షంగా క్వారీ లీజు కట్టబెట్టడం కుదరదు. దీంతో అనకాపల్లి జిల్లాకు చెందిన కూటమి కీలక ప్రజాప్రతినిధి ఒకరు, తమ వారికి నల్లరాయి క్వారీలను కట్టబెట్టాలనుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మరో కీలక నేత సూచించిన సంస్థకు మామిడిపాలెంలో నల్లరాయి క్వారీ లీజు కట్టబెట్టేందుకు తెర వెనుక చక్రం తిప్పారు.

మామిడిపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 109లో 50 నుంచి 60 హెక్టార్లలో నల్లరాయి కొండలు ఉన్నాయి. ఇప్పటికే అధికారికంగా ఇదే సర్వే నంబరులో నాలుగు నల్లరాయి క్వారీలు ఉండగా, అనధికారికంగా పదుల సంఖ్యలో క్వారీలు నడుస్తున్నాయి. తాజాగా మామిడిపాలెం రెవెన్యూ పరిధిలో 10.18 హెక్టార్ల నల్లరాయి కొండను మైనింగ్ లీజు కోసం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కె.ప్రియదర్శిని అనే వ్యక్తితో అనకాపల్లి గనుల శాఖ కార్యాలయానికి దరఖాస్తు చేయించారు. రెండు జిల్లాలకు చెందిన ఇద్దరు కీలక నేతలు తెర వెనుక ఉండి పావులు కదిపారు. గనులు, రెవెన్యూ, పంచాయతీ, కాలుష్య నియంత్రణ శాఖల అధికారులు లీజు మంజూరు పనులు చకచకా కానిచ్చేశారు. 109 సర్వే నంబరులో 4.18 హెక్టార్లను ఒక లీజుగా, ఆరు హెక్టార్లను మరో లీజుగా కట్టబెట్టేశారు. ఈ-వేలంలో ఈ క్వారీలు తమకే దక్కుతాయని చెబుతూ మంగళవారం మామిడిపాలెంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. సమావేశానికి ముందు చేసుకున్న చేసుకున్న లోపాకారి ఒప్పందాల ప్రకారం ప్రజల నుంచి ఎటువంటి అభ్యంతరాలు రాకుండా జాగ్రత్త పడ్డారు. తమకు అనుకూలంగా ఉండే వారిని మాత్రమే ప్రజాభిప్రాయ వేదికకు ఆహ్వానించి మొక్కుబడిగా కానిచ్చేశారు. సభకు హాజరైన వ్యక్తుల్లో ఒక్కరు కూడా నల్లరాయి క్వారీ లీజుపై అభ్యంతరం చెప్పలేదు. దీంతో ముందుగా అనుకున్నట్టుగానే రెండు వేర్వేరు సంస్థల పేర్లతో నల్లరాయి క్వారీ లీజులు కేటాయించినట్టు తెలిసింది.

ఎన్ఏవోబీకి బండరాళ్ల సరఫరా కోసమే..

రాంబిల్లి మండలంలో ఏర్పాటవుతున్న నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేషన్ బేస్ (ఎన్ఏవోబీ) కి పెద్ద మొత్తంలో భారీ బండరాళ్ల ... మిగతా 8వ పేజీలో

ముంచెత్తిన వాన

అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం, కోటవురట్లలో కుండపోత

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- డ్రైనేజీ కాలువలు పొంగి.. రోడ్లపై ప్రవహించిన నీరు
- ఎలమంచిలిలో 66.4, అనకాపల్లిలో 46.2 ఎం.ఎం. వర్షపాతం



కోటవురట్లలో కుండపోతగా కురుస్తున్న వర్షం

జిల్లా కేంద్రం అనకాపల్లితోపాటు ఎలమంచిలి, చోడవరం, కోటవురట్ల, అచ్యుతాపురం మండలాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులు వర్షం నీటితో పంట కాలువలను తలపించాయి. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి, రహదారులపై ప్రవహించాయి. ఎలమంచిలిలో అత్యధికంగా 66.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

పట్టణంలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అంతకు ముందు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధిక వేడితోపాటు ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు. తరువాత ఆకాశం మేఘావృతమై సుమారు అరగంట సేపు కుండపోతగా వర్షం కురిసింది. విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి కింద పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచిపోయింది. 104 వాహనం బ్రిడ్జి కిందకు వెళ్లి నీటిలో నిలిచిపోయింది. వంతెన కింద సుమారు నాలుగు అడుగుల లోతున నీరు నిలవడంతో అనకాపల్లి-చోడవరం మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వాహనాలను నాయుళ్లవీధి, లక్ష్మీదేవిపేట గేటు మీదుగా మళ్లించారు. కాగా పట్టణంలోని పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్ యథావిధిగా వర్షం నీటితో చెరువును తలపించింది. కాగా అనకాపల్లిలో 46.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు.



వర్షం నీటితో చెరువులా తయారైన ఎలమంచిలిలోని రాజీవ్ గాంధీ క్రీడా మైదానం

ఎలమంచిలిలో కుండపోత

ఎలమంచిలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

ఎలమంచిలిలో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సుమారు రెండు గంటలపాటు ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. పట్టణంలో సగానికిపైగా ప్రాంతాల్లో నీరు నిలిచింది. డ్రైనేజీ కాలువలు పొంగి ప్రవహించడంతో రోడ్లపై చెత్తాచెదారం, బురద పేరుకుపోయాయి. తులసీనగర్ బాలికోన్నత ప్లస్ స్కూలు ఆవరణలోకి వర్షం నీరు చేరింది. రాజీవ్ గాంధీ క్రీడామైదానం చెరువును తలపించింది. వర్షం కారణంగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం చెందారు. ఎలమంచిలిలో 66.4 మిల్లీమీటర్ల వర్షంపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

కాగా చోడవరం, అచ్యుతాపురం, కోటవురట్ల మండలాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. చోడవరంలోనిఇ కొత్తూరు జంక్షన్, పాతబస్టాండ్, చీడికాడ రోడ్డు, బాలాజీనగర్, బానయ్యకోనేరు ప్రాంతాలు నీట మునిగాయి. వరినాట్లు పూర్తయిన పొలాలకు, చెరకు, కూరగాయ పంటలకు ఈ వర్షం బాగా ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కనకారావు సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన జీవీఎంసీ కమిషనర్
- తీవ్రస్థాయిలో అవినీతి, ఆరోపణలు రావడమే కారణం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ అనకాపల్లి జోన్ పట్టణ ప్రణాళికా విభాగంలో సూపర్‌వైజర్ (టీపీఎస్)గా పనిచేస్తున్న కనకారావును కమిషనర్ సస్పెండ్ చేశారు. ఇటీవల ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జీవీఎంసీ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పట్టణ ప్రణాళికా విభాగం తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక భవన నిర్మాణాల విషయంలో టీపీఎస్ అవినీతికి పాల్పడుతున్నట్టు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. దీనిపై స్పందించిన విచారణ జరిపిన ఉన్నతాధికారులు, కమిషనర్‌కు నివేదిక ఇచ్చారు. ఆరోపణలు వాస్తవమని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో టీపీఎస్ కనకారావును సస్పెండ్ చేస్తూ జీవీఎంసీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని ఏసీపీ వెంకటరావు ధ్రువీకరించారు. ఇదిలావుండగా సస్పెన్షన్ విషయాన్ని ముందుగానే పసిగట్టిన కనకారావు మంగళవారం నుంచి మూడు నెలలపాటు సెలవు పెట్టారు.

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

ముంచంగిపుట్టు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పనితీరు బాగోలేదు

- రోగులకు వైద్య సేవలు అందించడంలో విఫలం
- జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- కేజీహెచ్‌లో అందుబాటులోకి క్యాన్సర్ చికిత్స
- సూపరింటెండెంట్ వాణి వెల్లడి
- గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ తీరుపై పలువురు సభ్యుల అసంతృప్తి
- జడ్పీ 1, 2, 4, 7 స్థాయీ సంఘ సమావేశాల్లో పలు సమస్యల ప్రస్తావన
- కోరం లేకపోవడంతో 3, 6 స్థాయీ సంఘ సమావేశాలు వాయిదా



జడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం



గ్రామీణాభివృద్ధి స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర. పక్కన సీఈవో నారాయణమూర్తి

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని, ప్రజలకు సేవలు అందించడంలో ముందు ఉండాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. బుధవారం జడ్పీ హాలులో 1, 2, 4, 7 స్థాయీ సంఘాల సమావేశాలు ఆమె అధ్యక్షతన జరిగాయి. వైద్య, ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ముంచంగిపుట్టు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ గీతాంజలి పనితీరు సరిగా లేదని, ఆస్పత్రులకు వచ్చే రోగుల సమస్యలు విని వారికి వైద్యం చేయడంలో విఫలమవుతున్నారన్నారు. అరకులోయ, అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు శెట్టి రోష్ని, డి.గంగరాజు మాట్లాడుతూ, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యుల మధ్య సమన్వయంలేదని, దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆస్పత్రుల నిర్వహణకు మంజూరుచేసే నిధుల వినియోగంలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ, కేజీహెచ్‌లో క్యాన్సర్ చికిత్సకు సంబంధించి అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని, జిల్లాకు చెందిన బాధితులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. గుండెకు సంబంధించి అన్ని రకాల ఆపరేషన్లు చేస్తున్నామని వెల్లడించారు. గ్రామీణాభివృద్ధి శాఖపై జరిగిన చర్చలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మాట్లాడుతూ, మండలంలోని వేచలంలో స్త్రీనిధి రుణాల మంజూరులో జరిగిన అవకతవకలను గత సమావేశంలో ప్రస్తావించానని, ఇది నచ్చక ఏపీఎం, ఇతర సిబ్బంది తన ఇంటికి వచ్చి గొడవ పడ్డారని అన్నారు. ఈ కారణంగా ఇక నుంచి జడ్పీ సమావేశాల్లో ప్రజా సమస్యలను ప్రస్తావించ కూడదని ... మిగతా 8వ పేజీలో

చోడవరం సబ్‌జైలు సిబ్బందికి షోకాజ్ నోటీసులు

- రిమాండ్ ఖైదీలు పరారైన ఘటనపై అధికారులు సీరియస్
- సూపరింటెండెంట్‌తోపాటు మరో ఇద్దరికి చార్జ్ మెమోలు



చోడవరం, సెప్టెంబరు 10 (ఆంఽధ్రజ్యోతి):

స్థానిక సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలుగా వున్న ఇద్దరు వ్యక్తులు, జైలు వార్డర్‌పై సుత్తితో దాడి చేసి, పరారైన ఘటనను జైళ్ల శాఖ అధికారులు తీవ్రంగా పరిగణించారు. ఆ సమయంలో విధుల్లో వున్న సబ్‌జైలు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. సబ్‌జైలు సూపరింటెండెంట్‌తోపాటు దాడికిగురైన వార్డర్, మరో ఉద్యోగికి అధికారులు చార్జి మెమోలు జారీ చేసినట్టు సమాచారం.

ఈ నెల 5వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ కార్యదర్శి నక్కా రవికుమార్, మాడుగులకు చెందిన బెజవాడ రాము, జైలు వార్డర్ బి.వీర్రాజుపై సుత్తితో దాడి చేసి, తలపై కొట్టారు. జైలు సిబ్బంది సెల్‌ఫోన్ లాక్కుని జైలు నుంచి పారిపోయారు. ఈ సంఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. సబ్‌జైలు నుంచి పారిపోయిన నిందితులను 24 గంటలు గడవకముందే విశాఖ నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని, చోడవరం పోలీసులకు అప్పగించారు. అనంతరం వీరిపై మరో కేసు నమోదు చేసి తిరిగి జైలుకు పంపారు. ఖైదీలు పారిపోయిన ... మిగతా 8వ పేజీలో

పీఎం-కుసుంకు ప్రభుత్వ భూముల సేకరణ

ప్రతి మండలంలో 10 ఎకరాల చొప్పున అవసరం

- మొత్తం 260 ఎకరాలు సేకరించాలని లక్ష్యం
- ఇంతవరకు 60 ఎకరాలు సేకరణ
- నెడ్‌క్యాప్ డీజీఎం నానిబాబు వెల్లడి



మాకవరపాలెం సీతన్నఅగ్రహారంలో పది ఎకరాల భూమి పత్రాలను నెడ్‌క్యాడ్ డీజీఎంకు అందజేస్తున్న తహశీల్దార్

మాకవరపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో 'పీఎం-కుసుం' (ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్) పథకం కింద సోలార్ వ్యవసాయ విద్యుత్ యూనిట్ల ఏర్పాటు కోసం 260 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరిస్తున్నట్టు నెడ్‌క్యాప్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.నానిబాబు తెలిపారు. బుధవారం ఆయన మాకవరపాలెం మండలం సీతన్నఅగ్రహారం ... మిగతా 8వ పేజీలో

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

చోడవరం మండలం నర్సాపురం వద్ద ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి
- నలుగురికి తీవ్రగాయాలు
- రావికమతం మండలం గొంప జంక్షన్‌లో ఆర్టీసీ బస్సును ఢీకొన్న మోపెడ్
- రైతుకు తీవ్రగాయాలు, ఆస్పత్రిలో మృతి



ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ధ్వంసమైన ఆటో, వేలాడుతున్న డ్రైవర్ మృతదేహం

చోడవరం/ రావికమతం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

చోడవరం నియోజకవర్గం పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. చోడవరం మండలం నరసాపురం సమీపంలో బుధవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. రావికమతం మండలం గొంప మెట్ట సమీపంలో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును, వెనుక నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో రైతు మృతిచెందాడు. ఈ రెండు సంఘటనలకు సంబంధించి ఆయా మండలాల పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి.

చీడికాడ మండలం జైతవరం గ్రామానికి చెందిన కురసా భూషణం, కురసా శంకరరావు, మాతల వరహాలమూర్తి, కురసా గంగునాయుడు, కురసా నాయుడు కొన్నేళ్ల నుంచి గాజువాకలో నివాసం వుంటున్నారు. వీరిలో కురసా భూషణం ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దేవరాపల్లి మండలం తెనుగుబూడిలో బంధువుల ఇంట జరిగిన పెద్ద కర్మకు వీరు గాజువాక నుంచి ఆటోలో వెళ్లారు. మధ్యాహ్నం భోజనాలు చేసిన తరువాత తిరిగి ఆటోలో గాజువాక బయలుదేరారు. చోడవరం మండలం నరసాపురం సమీపంలో ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా విశాఖపట్నం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు, ఆటోను బలంగా ఢీకొన్నది. దీంతో ఆటో నడుపుతున్న కురసా భూషణం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న కురసా శంకరరావు, కురసా గంగునాయుడు, మాతల వరహాలమూర్తి, కురసా నాయుడులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిలో శంకరరావు ... మిగతా 8వ పేజీలో

కాజ్‌వేను పునరుద్ధరించరా?



- విజయరామరాజుపేట వద్ద తాచేరుపై కొట్టుకుపోయిన తాత్కాలిక కాజ్‌వే
- మూడు వారాలు దాటినా పట్టించుకోని అధికారులు
- చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తున్నదని ప్రజల ఆవేదన

· 8లో

మార్టూరుకు మహర్దశ

▸ అచ్యుతాపురానికి కూతవేటు దూరంలో ఉన్నా పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం ▸ సమస్యలు విన్నవించినా ఫలితం శూన్యం
▸ కూటమి అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి ▸ తొలుత లక్షలాది రూపాయలు వెచ్చించి డ్రైనేజీ వ్యవస్థ మెరుగు


నిర్మాణ పనుల్లో భాగంగా కాలువ అడుగు భాగంలో వేసిన కాంక్రీటు

అచ్యుతాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు గ్రామానికి ఎట్టకేలకు మహర్దశ పట్టింది. మండల కేంద్రం అచ్యుతాపురానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో గల ఈ గ్రామం గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో మురుగు నీరు గ్రామంలో ఎక్కడికక్కడ నిలిచిపోయేది. దీంతో అంతటా దుర్గంధం వెదజల్లేది. కాలువలన్నీ పూడుకుపోయి చుక్కనీరు పైకి వెళ్లే దారిలేక పలుచోట్ల రోడ్డుపైకి చేరేది. ఈ సమస్యను గతంలో గ్రామస్థులు పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. నిధుల కొరత కారణంగా పనులు చేయలేక పోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితిని గ్రామస్థులు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఆయన వెంటనే అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. డ్రైనేజీల నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయించారు. అంతేకాకుండా వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కూటమి నాయకులు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో వాడుక నీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెడల్పయిన కాలువలను నిర్మిస్తున్నారు. కాలువల అడుగు భాగంలో కూడా కాంక్రీటు వేస్తున్నారు. ఇన్నాళ్లకు తమ ప్రధాన సమస్యలకు మోక్షం లభిస్తోందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కాలువల్లో పూడిక తీస్తున్న దృశ్యం

దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుకు ప్రధాని నిరంతర కృషి

▸ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్ కుమార్
▸ ఎలమంచిలిలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆనంద్‌కుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ చక్కని పాలన అందిస్తుండడంతో ప్రపంచ దేశాలు మన దేశం వైపు చూస్తున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయం ఆవరణలో బుధవారం బీజేపీ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చే విధంగా మోదీ పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో కూడా బీజేపీ కీలకపాత్ర పోషించడం ఖాయమని స్పష్టం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉండేలా జీఎస్టీని తగ్గిస్తుండడం మోదీ పాలనలో గొప్ప విజయంగా పేర్కొన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీవీఎస్ వర్మ, ఆడారి శ్రీధర్, ఆడారి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మూలపేటలో గంగాలమ్మ పండుగ



మునగపాక, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని మూలపేటలో గంగాలమ్మ పండుగ గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చపట్టినట్టు నిర్వాహకులు, గ్రామ పెద్దలు తెలిపారు. వేకువజాము నుంచి అమ్మవారికి పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా వారు కోరారు.

'సూపర్ సిక్స్- సూపర్ హిట్' సభకు నియోజకవర్గ నేతలు


అనంతపురం సభలో ప్రగడ నాగేశ్వరరావు, ధూళి రంగనాయకులు తదితరులు

ఎలమంచిలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో బుధవారం జరిగిన సూపర్ సిక్స్- సూపర్ హిట్ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు తదితరులు హాజరయ్యారు.

బకాయిల కోసం ఉపాధి కూలీల ఆందోళన



సచివాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న కూలీలు

మునగపాక, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కూలీలకు వారాల తరబడి బకాయిలు పెడితే ఆయా కుటుంబాల పోషణ ఏ విధంగా జరుగుతుందని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ ప్రశ్నించారు. వెంకటాపురం సచివాలయం వద్ద బుధవారం ఉపాధి కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 12 వారాలుగా ఉపాధి కార్మికులకు కూలి డబ్బులు ఇవ్వలేదన్నారు. వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే, పని ప్రదేశంలో తగిన సౌకర్యా కల్పించడంతో పాటు పనిముట్లను అందించాలన్నారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూలీలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం, రాంబిల్లిలో భారీ వర్షం


అచ్యుతాపురంలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

అచ్యుతాపురం/రాంబిల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా అచ్యుతాపురం పరిసర ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండింది. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. అనంతరం కుండపోతగా వాన పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు గ్రామీణ రహదారుల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఎరువులు తగు మోతాదులో వాడితే సత్ఫలితాలు


సదస్సులో మాట్లాడుతున్న బీసీటీ కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాదరావు

రాంబిల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడివాడలో బుధవారం ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిపురం బీసీటీ కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వానా ప్రసాదరావు మాట్లాడుతూ పంటల సాగులో ఎరువులు ఏ విధంగా, ఎంత మోతాదులో వాడాలి, సస్యరక్షణ చర్యలను వివరించారు. అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం అధికారిణి పి.విజేత మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనల మేరకు సాగు చేస్తే సత్ఫలితాలు సాధిస్తారని వివరించారు. మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత మాట్లాడుతూ అర లీటరు నానో యూరియా బస్తా యూరియాతో సమానమని తెలిపారు. దీనిని డ్రోన్ ద్వారా వరి పంటకు పిచికారీ చేసుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన దిగుబడిని పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆటో కార్మికులకు రూ.15 వేల ఆర్థిక సాయం ఆనందదాయకం'

ఎలమంచిలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వాహన మిత్ర పథకం ద్వారా ఆటో కార్మికులకు దసరాకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రతినిధి గనిశెట్టి ఏసుదాస్ హర్షం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు సర్వీసులు లేక డీలా పడ్డారని పేర్కొన్నారు. ఈ తరుణంలో వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం ఆనందదాయకంగా పేర్కొన్నారు. అలాగే, కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని విన్నవించారు.

కోటవురట్లలో కుండపోత వర్షం


కేకేబీ చర్చి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ

కోటవురట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కుండపోతగా వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్ర ఉక్కబోతతో ప్రజలు సతమతవుతున్న తరుణంలో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆకాశం మేఘ్మృతమైంది. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి కుండపోత వర్షం కురిసింది. మండలంలో గెడ్డలు, వాగులు, పొంగి ప్రవహించడంతో చెరువుల్లోకి సాగునీరు చేరుతున్నది. సుమారు రెండు గంటల పాటు ఏకదాటిగా పడిన వర్షానికి పంట పొలాల్లో నీరు పుష్కలంగా చేరింది. ఈ వర్షం వరి సాగుకు ఎంతగానో దోహదపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో కార్మికుల ఆందోళన



నినాదాలు చేస్తున్న ఆటో కార్మికులు

నక్కపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు పథకం ద్వారా ఉపాధి దెబ్బతిందని ఆటో కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. వీరికి వైసీపీ నేత వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు సంఘీభావం ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు పథకం వల్ల ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతింటున్నదని, వారిని ఆదుకోవాలని ఈ సందర్భంగా వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, యూనియన్ ప్రతినిధులు శీరం నూకరాజు, రాజు, దుర్గారావు, తాతబాబు, కృష్ణ, నాయుడు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యకర్తకు సత్కారం


మాస్టారును సత్కరిస్తున్న నాయకులు

నక్కపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐదు దశాబ్దాల నుంచి టైపు మాస్టారుగా అందరికీ సుపరిచితులైన నవర నూకరాజు శర్మను బుధవారం రాత్రి కొత్తపేటలో సిద్ధి వినాయక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. సామాజిక సేవా కార్యకర్తగా ఆయన చేస్తున్న సేవలను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎన్‌వీఎస్ ఆచార్యులు, పలువురు పెద్దలు ప్రశంసించారు. మండలంలోని అనేక గ్రామాల్లో ఆయన విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేశెట్టి నాగు, లోవ కన్నారావు, కొల్నాటి దుర్గ, దేశెట్టి గంగా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో మురికి నీటి నిల్వలు

ఇళ్ల మధ్య ప్రాంతాల్లో పేరుకుపోయిన మురుగు
దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్న వైనం
ప్రజలను వెంటాడుతున్న రోగాల భయం



ప్రశాంతినగర్‌లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో మురుగు.. కచ్చా కాలువలో పేరుకుపోయిన మురికి నీరు

పాయకరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవల పడిన వర్షాలకు పలు కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో మురుగు నీటి నిల్వలు పేరుకుపోయాయి. ఇవి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిపోయాయి. దీంతో ప్రజలు రోగాల భయంతో వణుకుతున్నారు.

పాయకరావుపేట మేజర్ పంచాయతీలోని పలు కాలనీల్లో వేసిన అక్రమ లేఅవుట్లలో కనీస వసతులు లేకుండానే ఇళ్లు నిర్మించుకున్నారు. బృందావనం, ప్రశాంతినగర్, రాజుగారిబీడు, సాయిఆదర్శనగర్, ధనిశెట్టినగర్, పెదిరెడ్డి సన్యాసిరావునగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లు లేకపోవడంతో పాటు కచ్చా కాలువలకు అవుట్‌లెట్లు లేక ఇళ్ల మధ్యన స్థలాలు మురికి కూపాలుగా మారుతున్నాయి. వర్షా కాలంలో ఈ మురికి కూపాల్లోకి వర్షం నీరు చేరి దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఆయా ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు మురికినీటి చెరువులను తలపిస్తున్నాయి. వీటికి ఇలానే వదిలేస్తే పందుల కారణంగా పారిశుధ్య సమస్య తలెత్తుతుందని, దోమలు పెరిగిపోయి వ్యాధులు ప్రబలుతాయని పట్టణ ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఇళ్ల మధ్యన ఖాళీ స్థలాల్లో మురికినీటిని బయటకు తరలించడంతో పాటు దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పీజీలో 'పేట' వైద్య విద్యార్థికి గోల్డ్‌మెడల్


గోల్డ్‌మెడల్ అందుకుంటున్న వైద్య విద్యార్థి సాయితేజ

పాయకరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోని 2022లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డెర్మటాలజీ విభాగంలో పాయకరావుపేటకు చెందిన వైద్య విద్యార్థి డాక్టర్ గుడివాడ సాయితేజ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా విజయ వాడలో మంగళవారం రాత్రి జరిగిన హెల్త్ యూనివర్సిటీ 28వ స్నాతకోత్సవంలో ప్రముఖ కార్డియాలజిస్ట్, నేషనల్ హార్ట్ ఇన్స్టిట్యూట్ సీఈవో డాక్టర్ యాదవ్, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్‌అందుకున్నారు.

శ్రీప్రకాష్‌లో ఓనం సంబరాలు


శ్రీప్రకాష్ విద్యాలయంలో ఓనం సంబరాలు చేసుకుంటున్న విద్యార్థినులు

పాయకరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో బుధవారం ఓనం సంబరాలు ఘనంగా జరిగాయి. జూనియర్ కళాశాల విద్యార్థినులు కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి పూజలు నిర్వహించారు. అనంతరం కేరళలో ప్రాచుర్యం పొందిన పాటలు, నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ భానుమూర్తి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు వివిధ రాష్ట్రాల సంస్కృతులపై అవగాహన కలుగుతుందన్నారు. తద్వారా దేశ భిన్నత్వంలో ఏకత్వానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌చార్జి లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పల్లా విలియంకేరికి సన్మానం

పాయకరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ సీనియర్ నేత పల్లా విలియంకేరిని బుధవారం పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ బోర్డు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.సత్యనారాయణ, ఎం.చంటిబాబు, వై.రాజయ్య, వి.భరత్, మండల పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఐజయ్య, ప్రేమ్‌కుమార్, విజయ్‌కుమార్, అరుణ్ కుమార్, శ్రీనివాస్, నాని, ఇస్సాకు, దయారత్నం, అనిల్, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో తనిఖీలు


రికార్డులు తనిఖీ చేస్తున్న కార్యదర్శి బుర్రా కుమార్ రాజు

నక్కపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక గ్రామీణ గ్రంథాలయంలో బుధవారం ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రా కుమార్‌రాజు తనిఖీలు చేశారు. గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించారు. పాఠకుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పంచాయతీల నుంచి రావాల్సిన గ్రంథాలయ పన్నును సకాలంలో వసూలు చేయాలని గ్రంథాలయాధికారి కె.జనార్దన్‌ను ఆదేశించారు. అలాగే పాఠకుల సంఖ్య మరింత పెంచాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. గ్రంథాలయంలో రికార్డుల నిర్వహణ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు.

రాజయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో..

నక్కపల్లి మండలంలోని రాజయ్యపేట గ్రామంలో ఎంపీడీవో డి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పర్యటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కేంద్రంలో పిల్లల హాజరు ఎక్కువగా వుండడంతో అంగన్‌వాడీ కార్యకర్తను అభినందించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో పరిశుభ్ర వాతావరణం కల్పించాలని, ఎప్పటికపప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని కార్యదర్శి కె.సత్యంను ఆదేశించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ చెప్పారు. మండలంలోని పాల్తేరు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వరి సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు, ఎరువుల గురించి ఆయన వివరించారు. వరి నారు చివర్లు తుంచి నాటుకోవాలని, ఎరువులను మోతాదులో వేసుకోవాలని చెప్పారు. అన్నదాత సుఖీభవ, పంట నష్ట పరిహారం, పంటల బీమా అందాలంటే ఈ పంట నమోదు తప్పనిసరన్నారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులోనే ఉందని, ఎటువంటి కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిట్టిబాబు, వ్యవసాయ సిబ్బంది నాగమణి, శివరామరాజు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉద్యోగుల సమస్యలపై నిరసన వారం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11 నుంచి నిరసన వారం కార్యక్రమాన్ని చేపడతామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నిరసిస్తూ ఉపాధ్యాయులంతా 11న నల్లబ్యాడ్జిలతో విధులకు హాజరు కావాలని, 12న మండల కేంద్రాల్లో నిరసనలు, 13, 14 తేదీల్లో ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే 15న పాత తాలూకా కేంద్రాల్లోను, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని, 17న సీఎం, సీఎస్‌లకు వాట్సాప్, మెయిల్ ద్వారా వినతిపత్రాలు అందజేస్తామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల బకాయిలను మంజూరు చేయడమే కాకుండా సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కుక్కల దాడిలో లేగదూడకు గాయాలు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురం గ్రామంలో బుధవారం కుక్కలు దాడి చేయడంతో లేగదూడ గాయపడింది. గ్రామానికి చెందిన వెంకటరెడ్డి పొలంలో రెండు రోజుల కిందట పుట్టిన లేగ దూడపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. గతంలో కూడా కుక్కలు గేదె దూడలపై దాడి చేసి చంపేసినట్టు రైతు వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించాలని కోరారు.

స్కూల్ బస్సుకు తప్పిన ముప్పు


ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

నక్కపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం హైవే వద్ద పాయకరావుపేటకు చెందిన ప్రైవేట్ స్కూల్ బస్సుకు పెద్ద ప్రమాదం తప్పింది. ఉదయం పిల్లలతో నక్కపల్లి నుంచి పాయకరావుపేట వెళ్తుండగా, ఉద్దండపురం వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. బస్సు వెనుక భాగం పాక్షికంగా దెబ్బతింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కావడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణిస్తున్నట్టు తెలిసింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు ఆరంభం

- ఈ నెల 22న కొలువుదీరనున్న దుర్గామాత
- పలుచోట్ల ముహూర్తపు రాట వేసిన నిర్వాహకులు



సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద రాటోత్సవంలో భక్తులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు పలుచోట్ల సన్నాహాలు ఆరంభమయ్యాయి. ఈనెల 22 నుంచి అమ్మలగన్న అమ్మ, ఆదిమాత దుర్గాదేవి కొలువుదీరనున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం ముహూర్తపు రాటను వేశారు. పట్టణంలోని గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద అర్చకులు భోగాపురపు వెంకట రమణ మంత్రోచ్చారణల నడుమ రాట వేశారు. పి.వెంకటఅప్పారావు, కోరిబిల్లి గంగాధర్ దంపతులు పూజ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు పి.వి.రమణ, ఆలయ శాశ్వత ఛైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, కమిటీ డైరెక్టర్లు గౌరీపరమేశ్వరి, మరిడిమాంబ ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే పరమేశ్వరీ పార్కు జంక్షన్‌లో నవ యువతరం స్వచ్ఛంద సంస్థ, పార్కు సెంటర్ యూత్ ఆధ్వర్యంలో దుర్గా నవరాత్రి వేడుకల సందర్భంగా ముహూర్తపు రాటను వేశారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని ఆయా కమిటీల సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూలం గోపి, మారిశెట్టి భాస్కర్, కాండ్రేగుల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



పరమేశ్వరీ పార్కు జంక్షన్‌లో...

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు

తుమ్మపాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ విధానాన్ని రైతులు అలవర్చుకోవాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ ఎస్.అప్పలరాజు సూచించారు. తుమ్మపాలలో బుధవారం ఏర్పాటైన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వరి పంట వేసుకునే 45 రోజుల ముందు నవ ధాన్యాలు వేసుకోవడం వల్ల పంటలో ఎటువంటి కలుపు లేకుండా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ రకం పండించిన పంటకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు నాగేశ్వరరావు, అప్పారావు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మండలంలోని ఫొటోగ్రాఫర్లు

సబ్బవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఇక్కడి దుర్గమాంబ ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కామిరెడ్డి అప్పారావు ప్రభుత్వాన్ని కోరారు. అయ్యన్నపాలెం వద్ద బుధవారం జరిగిన మండల ఫొటోగ్రాఫర్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలను ఆదుకుంటున్న విధంగానే తమపైనా దృష్టిసారించాలన్నారు. గత కొన్నేళ్లుగా ఫొటో, వీడియోగ్రాఫర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తమకు చేయూతనిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కార్యవర్గ ప్రతినిధులు శీరం రాజేశ్, బొజ్జ శివ, గౌర మధు, సుంకర శివ, కిశోర్, రాము, అప్పలరాజు, ఆరిపాక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో పోటీలు

కొత్తూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా జయంత్యుత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారని ఆ సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైస్కూల్ స్థాయిలో ఎనిమిది నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు 'కర్తవ్యమే దైవం' అంశంపై, ఇంటర్ విద్యార్థులకు 'మనం ఈ రోజు చేసే పనులపై రేపటి భవిష్యత్తు ఆధారపడి ఉంది. లేదా రేపటి భవిష్యత్తు నేడు మన చేతుల్లో ఉంది' అంశంపై, డిగ్రీ విద్యార్థులకు 'మార్పు అనేది ముందు నీతో మొదలైతే ప్రపంచంలో పరివర్తనకు నాంది' అంశంపై ఈ పోటీలు ఉంటాయని వివరించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రాష్ట్ర స్థాయికి పంపిస్తామని తెలియజేశారు. పోటీలను ఈనెల 15వ తేదీనాటికి పూర్తి చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందినవారి పేర్లు, పేపర్లు జిల్లా ప్రతినిధులకు అందజేయాలని సూచించారు.

కూరగాయల మార్కెట్ బంద్



దుకాణాల మూతతో నిర్మానుష్యంగా ఉన్న కూరగాయ మార్కెట్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కూరగాయల మార్కెట్ బుధవారం మూతపడింది. కూరగాయల వర్తక సంఘం ప్రతినిధి సూరిశెట్టి జగది ఇటీవల మృతి చెందడంతో వర్తకులు దుకాణాలు మూసివేసి ఆయనకు నివాళులర్పించారు. అయితే మార్కెట్ మూసివేత విషయం తెలియక చాలా మంది కూరగాయల కొనుగోలుకు విచ్చేశారు. దుకాణాలన్నీ మూసి వేసి ఉండడంతో వెనుదిరిగారు.

జూనియర్ కళాశాలకు వాటర్ మిషన్ బహూకరణ



కళాశాలకు వాటర్ మిషన్ అందజేసిన దాతలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బుధవారం రూ.25 వేలు విలువ గల ప్యూరిఫైడ్ వాటర్ మిషన్, ట్యాంక్‌ను దాతలు వితరణగా అందజేశారు. పొట్టి శ్రీరాములు జ్ఞాపకార్థం పి.మూర్తి సూచనల మేరకు జంగాల వెంకటరమణ, నాగలక్ష్మి దంపతుల సహకారంతో ఈ మిషన్‌ను సమకూర్చి విద్యార్థులకు నాణ్యమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు.



కలపాక బీసీ కాలనీ వద్ద దెబ్బతిన్న రహదారి



సచివాలయం సమీపంలో...

రహదారులు ఇలా.. ప్రయాణాలు ఎలా..

- అధ్వానంగా కలపాక -పిట్టవానిపాలెం రోడ్డు
- లంకెలపాలెం కూడలి నుంచి పెదముషిడివాడ వెళ్లే మార్గం మరీ దారుణం
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- అవస్థలు పడుతున్న వాహనచోదకులు

పరవాడ/ లంకెలపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలుచోట్ల రహదారులు అధ్వానంగా మారాయి. వీటిపై రాకపోకలు అంటేనే జనం హడలిపోతున్నారు. ఎక్కడికక్కడ గుంతలమయం కావడంతో అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు దృష్టి సారించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలపాక నుంచి పిట్టవానిపాలేనికి వెళ్లే రహదారి మరింత దారుణంగా తయారైంది. దారి పొడవునా పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో రాకపోకలు సాగించే గ్రామీణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికితోడు దెబ్బతిన్న రహదారిపై రాళ్లు తేలి ఉండడంతో నడవలేని పరిస్థితి నెలకొంటుంది. గతఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం ఈ రహదారికి మరమ్మతులు కూడా చేపట్టలేదు. వర్షాల సమయంలో రహదారిపై ఉన్న గోతుల్లో నీరు చేరుతుండడంతో ఎక్కడ అడుగు వేస్తే ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం గ్రామీణ ప్రజలను వెంటాడుతోంది. చీకటి పడితే ఈ రహదారి గుండా ప్రయాణించడం నరకాన్ని తలపిస్తోందని చెబుతున్నారు. ముఖ్యంగా బీసీ కాలనీ నుంచి కలపాక సచివాలయానికి మధ్య రహదారి పూర్తిగా ధ్వంసమైంది. వర్షపునీరు గుంతల్లో చేరడంతో మరిన్ని అవస్థలకు కారణమవుతున్నాయి. హిందుజా పవర్ ప్లాంట్‌కు వెళ్లే కార్మికులు గుంతల కారణంగా ద్విచక్ర వాహనాలు పాడవుతున్నాయని వాపోతున్నారు.



కన్నూరు సమీపంలో రహదారిపై పడిన భారీ గుంతలు

లంకెలపాలెం కూడలి నుంచి...

ఇదిలావుంటే, లంకెలపాలెం కూడలి నుంచి పెదముషిడివాడ, పరిసర ప్రాంత గ్రామాలకు వెళ్లే రహదారి మరింత దారుణంగా తయారైంది. దారి పొడవునా పెద్ద పెద్ద గోతుల పడడంతో ఛిద్రంగా మారింది. దీంతో ఇటుగా ప్రయాణించే వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం శివారు గ్రామాలైన పెదముషిడివాడ, పచ్చికోరువానిపాలెం, విజయరాంపురం, గండివానిపాలెం, నక్కవానిపాలెం, మార్కండేనగర్, కన్నూరు, మంత్రిపాలెం గ్రామాల ప్రజలు లంకెలపాలెం కూడలికి వివిధ పనులపై వచ్చి వెళుతుంటారు.



పెదముషిడివాడ వద్ద..

అలాగే, మండల కేంద్రం పరవాడకు రావాలన్నా ఈ రహదారిపైగుండానే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. రహదారిపై అడుగడునా పెద్ద గోతులు పడడంతో వాహనదారులు భయపడుతున్నారు. నెల రోజులుగా ఇక్కడ ఇదే పరిస్థితి దాపురించినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలంతా కోరుతున్నారు.

కొమ్మ పడిందో.. ఆస్పత్రి పాలే..

- పరవాడ- వాడ చీపురుపల్లి ప్రధాన మార్గంలో పొంచి ఉన్న ప్రమాదం
- చెట్లు ఎండి ఉండడంతో రాకపోకలకు ఆందోళన

పరవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊటగెడ్డ జంక్షన్ నుంచి సింహాద్రి ఎన్టీపీసీ మీదుగా వాడ చీపురుపల్లి వెళ్లే ప్రధాన మార్గంలో అడుగడుగునా ప్రమాదం పొంచి ఉంది. రహదారిని ఆనుకొని ఉన్న ఎండిపోయిన చెట్ల కొమ్మలు ఎప్పుడు ఎవరిపై పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఎన్టీపీసీ కార్మికులు, ఉద్యోగులతో పాటు వాడ చీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, నునపర్తి పంచాయతీలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.



రహదారికి ఆనుకొని కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లు

ఎండిన చెట్లకొమ్మలు అప్పుడప్పుడు విరిగి పడుతుండడంతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే వీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం : సీఐ

సబ్బవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సీఐ జి.రామచంద్రరావు సూచించారు. మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం పరిధిలో గల పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. వాటికి యువత దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు ముఖ్యంగా చదువుపై దృష్టి సారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని వివరించారు. మాదకద్రవ్యాలు సేవించినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదేవిధంగా రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ రామచంద్రరావు

సోమవరంలో పశువులకు గర్భకోశ పరీక్షలు



పాడి రైతులకు సూచనలిస్తున్న సహాయ సంచాలకురాలు సౌజన్య

కశింకోట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమవరం గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల మిషన్ నిధులతో ఏర్పాటైన ఈ శిబిరంలో 64 పశువులకు గర్భకోశ పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకురాలు డాక్టర్ బి. సౌజన్య మాట్లాడుతూ పశు పోషణ గురించి వివరించారు. నర్సింగబిల్లి పశువైద్యాధికారి డాక్టర్ అల్ఫోన్స జార్జ్ మాట్లాడుతూ దూడలకు నట్టల నివారణ మందు వేసినట్టు చెప్పారు. అనంతరం ఖనిజలవణ మిశ్రమాన్ని పాడి రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కశింకోట పశువైద్యాధికారిణి డాక్టర్ చైతన్యమణి, పశు గర్భకోశ వైద్య నిపుణులు పి.హరిప్రియ, సర్పంచ్ గొంతిన నూకరత్నం, టీడీపీ నాయకులు గొంతిన శ్రీనివాసరావు, గూడెపు సూర్యప్రకాశ్, గొంతిన శ్రీను, కర్రి నాగసత్య శ్రీను, దేవుళ్ళ, గుర్రం రమణ, కోన రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లుప్పిలో పశువుల పాకల తొలగింపు తగదు

- డిప్యూటీ తహశీల్దార్‌కు దళిత రైతులు ఫిర్యాదు
- సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి

సబ్బవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లుప్పిలో తమ పశువుల పాకలను రెవెన్యూ అధికారులు కూల్చివేయడం తగదని ఆ గ్రామానికి చెందిన దళిత రైతులు కాకర అమ్మతల్లి, వెంకటరమణ, గోపీనాథ్, అప్పలరాజు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్.అప్పారావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లుప్పి గ్రామ సర్వే నెంబరు 16లో 2.48 ఎకరాల ప్రభుత్వ భూమి/గెడ్డ వాగు ఉందన్నారు. అందులో తరతరాలుగా పాకలు వేసుకుని పశువులను మేపుకుంటూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. అయితే అక్కడికి సమీపంలో ఓ వ్యక్తికి 150 ఎకరాల భూమి ఉందన్నారు. సదరు భూమిలోకి నీరు ప్రవహించకుండా సర్వే నెంబర్లు 10, 16లలో మొగల్ చెరువుకు వెళ్లే గెడ్డ వాగు స్థలాన్ని పూడ్చేసి చదును చేసి రోడ్డును వేశారని ఆరోపించారు. దిగువన ఉన్న చెరువులకు ఇప్పటికే వరద నీరు పారక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పుడు రోడ్డు వెడల్పు సరిపోలేదని, సదరు భూ యజమాని ఉన్నతాధికారులకు దరఖాస్తు చేశారన్నారు. సర్వే నెంబరు 16లో మిగిలి ఉన్న తమ స్థలంలో పశువుల పాకలను బుధవారం ఆర్ఐ వీరయ్య, వీఆర్వో గోవింద సిబ్బందితో వచ్చి జేసీబీ ద్వారా కూల్చివేశారని వాపోయారు. ఈ విషయమై తమకు కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపి న్యాయం చేయాల్సిందిగా వారు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మచ్చ దేముడు, కాకర చండేశ్వరరావు, యల్లపు అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దార్ అప్పారావుకు వినతి పత్రం అందిస్తున్న రైతులు

నేడు తాళ్లపాలెంలో అభివృద్ధి పనులు ప్రారంభం

కశింకోట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం పంచాయతీలో గురువారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో బ్యాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్, నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో సీసీ రోడ్డు ప్లాట్‌ఫాం, రామాలయం ఆవరణలో సీసీ రోడ్డు ప్లాట్‌ఫాం, తాళ్లపాలెం సంత మార్కెట్‌లో నాబార్డు నిధులతో కూరగాయల వ్యాపారులకు నిర్మించిన షెడ్లు, బంగారయ్యపేటలో శివాలయం వద్ద సీసీ రోడ్డును ప్రారంభించనున్నారని కూటమి నాయకులు తెలిపారు.

'గ్రంథాలయ పన్ను బకాయిలు వసూలు చేయండి'



రికార్డు పరిశీలిస్తున్న సంస్థ కార్యదర్శి కుమార్ రాజా

కశింకోట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలోని శాఖా గ్రంథాలయాన్ని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. అంతేకాకుండా పంచాయతీ చెల్లించాల్సిన గ్రంథాలయ పన్ను బకాయిలను వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాయాధికారి కె.జగన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం ఐలమ్మ అలుపెరుగని పోరాటం : ఐద్వా



ఐలమ్మ చిత్రపటం వద్ద ఐద్వా ప్రతినిధుల నివాళి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేదల కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఐలమ్మ వర్ధంతిని బుధవారం ఇక్కడ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి ఐద్వా ప్రతినిధులు కేవీఎస్ సూర్యప్రభ, జి.గౌరీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐలమ్మ పేదల కోసం, బడుగు బలహీనవర్గాల కోసం ఎన్నో త్యాగాలు చేశారన్నారు. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో పెత్తందారులపై పోరాటాలు సాగించారన్నారు. ఈ కార్యక్రమంలో పి.మాణిక్యం, డీడీ వరలక్ష్మి, అన్నపూర్ణ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ జోన్ టీపీవోగా వరప్రసాద్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ టీపీవోగా వరప్రసాద్ నియమితులయ్యారు. ఏడాదికి పైగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో గాజువాక జోన్‌లో పనిచేస్తున్న వరప్రసాద్‌ను కమిషనర్ ఇక్కడ నియమించారు. నేడో, రేపో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారని సమాచారం.

85 మందికి కంటి వైద్య పరీక్షలు



రోగికి కంటి పరీక్ష జరుపుతున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గొలగాం పంచాయతీ శివారు యల్లారమ్మ కాలనీలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అమ్మ ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు సుమారు 85 మందికి కంటి పరీక్షలు జరిపారు. వీరిలో 22 మందిని క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం కంటి సంరక్షలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గంగాధర్, రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కశింకోట మండల అధ్యక్ష పదవికి గట్టి పోటీ..

- ప్రస్తుతం ఈ పదవిలో కొనసాగుతున్న కాయల మురళీధర్
- మళ్లీ దక్కించుకునేందుకు ప్రయత్నాలు
- పోటీ పడుతున్న సోమవరం గ్రామానికి చెందిన గొంతిన శ్రీనివాసరావు

కశింకోట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కశింకోట మండల అధ్యక్ష పదవికి గట్టి పోటీ ఏర్పడింది. ప్రస్తుతం ఈ స్థానంలో కాయల మురళీధర్ కొనసాగుతున్నారు. కొత్తగా గ్రామ, మండల స్థాయిలో అధ్యక్ష, కార్యదర్శుల నియామకం జరుగుతున్న నేపథ్యంలో కశింకోట మండల అధ్యక్ష పీఠాన్ని మళ్లీ దక్కించుకునేందుకు మురళీధర్ ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలాగే, సోమవరం గ్రామానికి చెందిన గొంతిన శ్రీనివాసరావు కూడా ఈ పదవిని ఆశిస్తూ పోటీ పడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఆధ్వర్యంలో ఇరువురి సమక్షంలో ఇటీవల చర్చలు జరిపినా ఫలించలేదు. దీనిపై తాతయ్యబాబును వివరణ కోరగా, టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎవరినీ నియమించలేదని స్పష్టం చేశారు. అధిష్టానం ఆదేశాల మేరకు ఎవరన్నది అధికారిక ప్రకటన చేయనున్నట్టు చెప్పారు.

సమస్యల మధ్య చదువులు

▸▸ రాసపణుకులో అసంపూర్తిగా పాఠశాల భవనం

జి.మాడుగుల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంతాల పంచాయతీ రాసపణుకు ప్రభుత్వ పాఠశాల భవనం పనులు పూర్తి చేయాలని సర్పంచ్ జి. పద్మ కోరారు. గ్రామంలో సుమారు 35 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వీరికి పాఠశాల భవనం లేక వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన పాఠశాల భవనం పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారని పేర్కొన్నారు. ఆయ పనులు పూర్తి చేయాలని లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని సర్పంచ్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించారు.



రాసపణుకులో అసంపూర్తి పాఠశాల భవనం ముందు చిన్నారులు

నేలజర్తలో 140 మందికి ఒక్కరే వలంటీరు



నేలజర్తలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

సీలేరు, సెప్టెంబరు 10 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారకొండ స్కూల్ కాంపెక్సు పరిధిలోని నేలజర్త ఎంపీపీ పాఠశాలకు ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభం (జూన్ 13) నుంచి ఇంత వరకు ఉపాధ్యాయులు లేరు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు 104 మంది విద్యార్థులుండగా. కేవలం భాషా వలంటీర్ ఒక్కరే పిల్లలకు బోధన చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తునారు. దీంతో ఉపాధ్యాయులు లేక తమ పిల్లలు విద్యకు దూరమైపోతున్నారని పలుమార్లు విద్యాశాఖాధికార్లకు విన్నవించినా ఇప్పటి వరకు టీచర్లను నియమించలేదంటూ దండకారణ్య విమోచనాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్క్‌రాజు ఆరోపించారు. బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. అలాగే, గుమ్మిరేకవుల పంచాయతీ పరిధిలోని సుమారు 16 పాఠశాలకు నేటికీ ఉపాధ్యాయులు లేరని చెప్పారు.

బురదమయం.. నరకప్రాయం



కొండంగి నుంచి పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.కొడింగి గ్రామంలో ఆదివాసీ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలకు ఇళ్లనుంచి పాఠశాలకు వెళ్లే రహదారి బురదమయమైంది. కొడుసింగి ఎంపీపీ పాఠశాలలో 32 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరికి కిలోమీటరు దూరంలో పాఠశాల భవనం ఉన్నది. దీంతో రోజూ విద్యార్థులు ఈ బురదమయమైన రహదారిలో వెళ్తూ అగచాట్లు పడుతున్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ గుర్తించి సీసీ రోడ్డు నిర్మించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆస్పత్రిలో ప్రసవం పొందడమే సురక్షితం



గర్భిణులను ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి

చింతపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవం పొందడమే సురక్షితమని స్త్రీవైద్యనిపుణులు డాక్టర్ ఎస్.వాసవి అన్నారు. బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 215మంది గర్భిణులకు స్త్రీవైద్యనిపుణులు వైద్యపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తొమ్మిది నెలల్లో ఒక్కసారైన స్కానింగ్ చేయించుకోవాలన్నారు. దీనివల్ల ప్రమాదకరమైన ప్రసవాలను ముందుగా గుర్తించవచ్చునన్నారు. గర్భిణులు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకుంటూ పోషకాహారం తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవం పొందడం వల్ల మాత, శిశు మరణాలను నియంత్రించవచ్చునన్నారు. గర్భిణులకు వసతి గృహంలో పూర్తి స్థాయి సదుపాయాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో స్త్రీ వైద్యనిపుణులు శ్రీలత, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి పాల్గొన్నారు.

ఏఎస్పీకి మండల సాధన సమితి వినతి



చింతపల్లి ఏఎస్పీకి వినతి పత్రం అందిస్తున్న ధారకొండ మండల సాధన కమిటీ సభ్యులు

సీలేరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ధారకొండను మండల కేంద్రంగా ఏర్పాటులో తమవంతు సహకారాన్ని అందించాలని చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతిమిశ్రాను బుధవారం మండల సాధన కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా చింతపల్లిలో తన కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. ధారకొండ మండల కేంద్రం ఆవశ్యకత, ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏఎస్పీకి వివరించారు. దీనిపై ఏఎస్పీ సానుకూలంగా స్పందించినట్టు మండల సాధన కమిటీ వెల్లడించింది. ఈ కార్యక్రమంలో మండల సాధన కమిటీ సభ్యులు జగన్, సుందరయ్య, సుంకర విష్ణుమూర్తి, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు రాంబాబు, అల్లంకిరాజు, కొర్రా రాము తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల యూనియన్ నూతన కార్యవర్గం ఎంపిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులు నాగమ్మ, భాగ్యలక్ష్మి

పాడేరురూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎంపిక చేసినట్టు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి లింగేటి సుందరరావు తెలిపారు. సంఘ జిల్లా 2వ మహాసభలు సందర్భంగా రెండవ రోజు బుధవారం ఈ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షురాలిగా డి.నాగమ్మ, ప్రధాన కార్యదర్శిగా కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, కోశాధికారిగా చిన్నారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కళావతి, ఉపాధ్యక్షులుగా వసంత, ఎస్.ఈశ్వరమ్మ, డి.నిర్మల, కె.అమ్మాజీ, ఇందుమతి, వి.సుమిత్ర, సహాయ కార్యదర్శులుగా కె.కొండమ్మ, కె.సత్యవతి, మోదకొండమ్మలతో పాటు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 11 మందిని జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎనున్నారు. రాష్ట్ర యూనియన్ సభ్యులు పద్మ, శోభ పాల్గొన్నారు.

రోడ్డు, వంతెన నిర్మాణానికి సర్వే



రేగుళ్లపాలెం- తముటు గ్రామాల మధ్యన గెడ్డపై వంతెన నిర్మాణానికి సర్వే చేస్తున్న అధికారులు

అనంతగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట పంచాయతీ రేగుళ్ల పాలెం నుంచి తముటు గ్రామానికి రోడ్డు సౌకర్యంతో పాటుగా గెడ్డపై వంతెన నిర్మాణానికి బుధవారం పంచాయతీరాజ్‌రాజ్ ప్రాజెక్ట్ ఏఈ గణేశ్, స్థానిక సర్పంచ్ శిరగం గణేశ్‌తో కలిసి సర్వే నిర్వహించారు. గెడ్డనుదాటుకునిఆవతలివైపుగా చేరుకునేందుకు ఆయా గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన, రోడ్డు సర్వే నిర్వహించడంపై పంచాయతీ నాయకుడు శ్రీనివాసరావు, గిరిజనులు హర్షం చేస్తున్నారు. నివేదికను ఢీల్లి ఎన్ఆర్‌డీఏకు పంపిస్తామని ఏఈ తెలిపారు.

మరో రెండు రహదారులకు..

అనంతగిరి: మండలంలోని మారుమూల పెదకోట పంచాయతీ పరిధిలోగల వేల మామిడి- బొడ్డపుట్టు, సర్వపాడు -టాంకోట రహదారుల పనులకు పీఆర్ ప్రాజెక్ట్ అధికారులు, సర్పంచ్ అన్నపూర్ణదేవి బుధవారం సర్వే చేశారు. గతంలోని గ్రావెల్ రోడ్లు నిర్మించారు.. పూర్తిస్థాయిలో బీటీ రోడ్ల నిర్మాణానికి సర్వే చేయడంపై గ్రామస్తులు, సర్పంచ్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఆయా గ్రామాలకు రహదారి కష్టాలు తీరనున్నాయి.

కరాటే శిక్షణతో ఆత్మరక్షణ



డిగ్రీకళాశాల బాలికలకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి

పాడేరురూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఆత్మ రక్షణకు కరాటే, తైక్వాండోలతో శిక్షణను పొందాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి సూచించారు. కళాశాలలో బుధవారం బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కరాటే అకాడమీ చీఫ్ ఇన్స్ట్రక్టర్ బి.పాండురాజు మాట్లాడుతూ కరాటే శిక్షణతో బాలికల్లో ఆత్మవిశ్వాసం, మనోధైర్యం పెరుగుతుందన్నారు. సెల్ఫ్‌డిఫెన్స్ కార్యక్రమాన్ని పీఎం ఉష ద్వారా అందిస్తున్నామన్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్.టీఎస్.రసూల్ మాట్లాడుతూ నెల రోజులు పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే ట్రైనర్స్ వి.అప్పన్న, కె.సురేశ్, సూర్యప్రకాశ్, వెంకట్, స్టాలిన్, అధ్యాపకులు,పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న యూటీఎఫ్ నేతలు

డుంబ్రిగుడ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులకు బుధవారం యూటీఎఫ్ సంఘం ప్రతినిధులు సన్మానించారు. జాంకరవలస పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ధర్మ మండల స్థాయిలో, సాగర పాఠశాలలో రాజ్‌కుమార్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులందుకున్నారు. ఈ నేపథ్యంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు శెట్టి బాలకృష్ణ ఆధ్వర్యంలో వీరిని సన్మానించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కన్నయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రఘునాథ్, సుబ్బారావు గెన్ను దుక్కు. తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం



బస్ షెల్టరును శుభ్రం చేస్తున్న వనవాసి కల్యాణ పరిషత్ ప్రతినిధి విద్యాధర్, తదితరులు

కొయ్యూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వనవాసి కల్యాణ పరిషత్ రాష్ట్ర సంఘటన మంత్రి విద్యాధర్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా బొర్రంపేట బస్ షెల్టరు పరిసరాల్లో పారిశుధ్య పరిరక్షణ చర్యలు చేపట్టారు. జిల్లా సమాచార హక్కు చట్టం కో ఆర్డినేటర్ అర్జునరెడ్డితో కలసి కొమ్మిక పంచాయతీ బొర్రంపేట కూడలిలో ఉన్న బస్ షెల్టరు వద్ద చెత్తా చెదారాలు, మద్యం సీసాలను తొలగించారు.ఈ కార్యక్రమంలో వనవాసి కల్యాణ పరిషత్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

విధులకు రాకుండా సంతకం చేయడంపై ఆగ్రహం



చిలకలగెడ్డ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో ప్రభాకర్

అనంతగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏజెన్సీ ముఖద్వారమైన చిలకలగెడ్డ సచివాలయాన్ని బుధవారం ఎంపీడీవో ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధులకు రాకుండానే హాజరుపట్టికలో కార్యదర్శి లావణ్య సంతకాలు ఉండడంపై మండిపడ్డారు. ఉదయం 11.30 సమయంలో ఎంపీడీవో వెళ్లి హాజరుపట్టికను, మూమెంట్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. కార్యదర్శి 9వ తేదీనే 10వ తేదీకి సంబంధించి విధులకు వచ్చినట్టుగా సంతకాలు చేసి ఉండడాన్ని గుర్తించారు. అనంతరం మిగిలిన సచివాలయం సిబ్బంది సేవలపై ఆరా తీశారు. హాజరు విషయంపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. పరిపాలన అధికారి ఏవీవీ కుమార్ ఉన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా: ఏవో



యూరియా పంపిణీ చేస్తున్న ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి, ఏవో

చింతపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్థానిక వ్యవసాయ అధికారి టి. మధుసూదనరావు అన్నారు. బుధవారం తాజంగి రైతు సేవాకేంద్రంలో గిరిజన రైతులకు ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి చేతుల మీదుగా యూరియాను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నదన్నారు. కార్యక్రమంలోప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి,వీఏఏ అనురాధ పాల్గొన్నారు.

కొయ్యూరు ఏవోగా రాజ్‌కుమార్



కొయ్యూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయశాఖాధికారిగా జిల్లా వ్యవసాయ కార్యాలయంలో టెక్నికల్ విభాగంలో ఏవోగా పనిచేస్తున్న బి. రాజ్‌కుమార్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఏవోగా పనిచేస్తున్న భాను ప్రియాంకను జిల్లా వ్యవసాయ కార్యాలయంలో టెక్నికల్ విభాగ ఏవోగా డిప్యుటేషన్‌పై పంపారు. ఇటీవల జరిగినసాధారణ బదిలీలలో కొయ్యూరు ఏవోగా వచ్చిన భాను ప్రియాంకను ఆకస్మికంగా డిప్యుటేషన్‌పై వేయడంపైఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సౌకర్యవంతంగా స్మార్ట్ రేషన్ కార్డులు



లబ్ధిదారులకు కార్డులను అందిస్తున్న టీడీపీ డివిజన్ నేత పాండురంగస్వామి

ముంచంగిపుట్టు/ సీలేరు సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు అందిస్తున్న డిజిటల్ స్మార్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ డివిజన్ నేత, దారెల పంచాయతీ సర్పంచ్ పి.పాండురంగస్వామి అన్నా రు. ఆ పంచాయతీ పరిధిలోని రంగిలిసింగి, మాలిపుట్టు, పెదపేట గ్రామాలలో సర్పంచ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు డిజిటల్ స్మార్ కార్డులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులు రేషన్ సరకులను ఎక్కడైనా తీసుకొనే విధంగా వెసులుబాటు ఉందన్నారు. జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీలోని బూసుకొండ, వలసగెడ్డ, శాండికోరి, వలసగెడ్డకాలనీల్లో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమారాణి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.జనసేన నాయకుడు బాలకృష్ణ, మండి బొజ్జ, కొర్రా బాస్కరరావు, శేఖర్ పాల్గొన్నారు.

అయ్యప్ప విగ్రహాన్ని తాకిన సూర్య కిరణాలు



మూలవిరాట్‌కు తాకిన సూర్యకిరణాలు

పాడేరురూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పూర్ణపుష్కలాంబ అయ్యప్ప స్వామి ఆలయంలో ఉన్న అయ్యప్ప స్వామి గర్భగుడిలోని మూలవిరాట్‌కు బుధవారం ఉదయం 6.38 గంటల సమయంలో పాల, అమృతాభిషేకాలు చేస్తుండగా సూర్య కిరణాలు తాకాయి. గతంలో ఎన్నడూలేని విధంగా విగ్రహానికి కిరణాలు తాకడంతో ఈ విషయం ప్రధాన అర్చకులు ఆల య ధర్మకర్త, ఆలయ కమిటీ ప్రతినిధులకు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను చేపట్టారు.

దెబ్బతిన్న కల్వర్టు...రాకపోకలకు ఇక్కట్లు



మొక్కాపుట్టు సమీపంలో కల్వర్టు కోతకు గురైన దృశ్యం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి మండలంలో గల మాకవరం పంచాయతీ మొక్కాపుట్టు సమీపంలోకల్వర్టు దెబ్బతింది. మంగళ వారం రాత్రి నుంచి వరదనీటి ఉధృతికి కల్వర్టు సగభాగం కోతకు గురైంది. దీంతో అటుగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాగే, వర్షం పడితే పూర్తి స్థాయిలో కల్వర్టు పోయే అవకాశం ఉందని ఆ ప్రాంతీయులు అంటున్నారు. విషయం తెలుసుకున్న ఈవోపీఆర్డీ చి న్నాన్న దెబ్బతిన్న కల్వర్టుని పరిశీలించారు. అలాగే అలబీరు ఘాటీ మధ్యలో రహదారిపై పడిన కొండ చరియలను దగ్గరుండి తొలగించారు.

రహదారిపై చెట్లు తొలగింపు

ముంచంగిపుట్టు: మండలంలో గల మాకవరం పంచాయతీ కుతుడ గ్రామ సమీపంలో రహదారికి సోమవారం అడ్డంగా చెట్టు, కొండచరియలు పడ్డాయి. టీడీపీ నేతల చొరవతో బుధవారం వాటి తొలగించారు. టీడీపీ అరకు ఇన్‌చార్జి, ఆర్టీసీ విజయనగరం జిల్లా జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షురాలు కె.సన్యాసమ్మ, బాపూజీలు తమ సొంత డబ్బులు వెచ్చించి వాటిని తొలంచేలా చర్యలు తీసుకున్నారు.

గింజంగిలో సీసీ రోడ్డు నిర్మాణం

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ గింజంగి గ్రామంలో జడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్టు స్థానిక ఎంపీపీ బోయిన కుమారి తెలిపారు. బుధవారం సర్పంచ్ అడపా ప్రియాంకతో కలిసి ఎంపీపీ ఈ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూజడ్పీటీసీ శివరత్నం నిధులు కేటాయించారన్నారు. గ్రామ పెద్దలు జర్త బాలన్న, లోచల సత్యనారాయణ, వెంకట్, గబులంగి సతీశ్ కుమార్, లింగేశ్వరరావు పాల్గొన్నారు.

జీకే వీధి మండలానికి 12 టన్నుల యూరియా



మాట్లాడుతున్న ఏవో గిరిబాబు

సీలేరు, సెప్టెంబరు 10 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలంలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయాధికారి గిరిబాబు తెలిపారు. ధారకొండలో మంగళవారం యూరియా పంపిణీలో తలెత్తిన గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. యూరియా కొరత నేపథ్యంలో ఉన్నతాధికారులు మరో 20 టన్నుల యూరియా జీకేవీధికి గురువారం సరఫరా చేస్తున్నారన్నారు. 20 టన్నుల్లో 5 టన్నులు రింతాడ , ధారకొండకు 3 టన్నులు, గుమ్మిరేవులు, దుప్పులవాడ రైతు సేవా కేంద్రం పరిధిలో 6 టన్నులు యూరియా పంపిణీ చేస్తామన్నారు. మిగతా 4 టన్నులు మండలంలోని రైతు సేవా కేంద్రాల పంపిస్తామన్నారు. ఈ నెల 12 న మరో 20 టన్నులు యూరియా రానుందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

'రాజ్‌మా సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం'



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఐటీడీపీ ఇన్‌చార్జి మహేంద్ర

చింతపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో రాజ్‌మా సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఐటీడీపీ ఇన్‌చార్జి వి. మహేంద్ర అన్నారు. బుధవారం లంబసింగి రైతు సేవా కేంద్రంలో రైతులు రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఐటీడీపీ ఇన్‌చార్జి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాట్లుకు ముందుగా 90శాతం రాయితీతో విత్తనాలను సరఫరా చేసిందన్నారు. 50శాతం రాయితీపై విత్తన శుద్ధి మందులను అందజేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కొర్ర శాంతి, టీడీపీ సీనియర్ నాయకుడు కిముడు లక్ష్మయ్య, బోనంగి పార్వతి పడాల్, జనసేన నాయకుడు చిన్నిరాజుబాబు, గ్రామ యువత నాయకుడు గసాడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నియంత్రించాలి

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతి భద్రతలు పరిక్షణకు పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు అన్నారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో కూటమి నాయకులు కలిశారు. ఎస్సై సురేశ్‌ని సన్మానించారు. ఈసందర్భంగా కొండలరావు మాట్లాడుతూ జాతీయ రహదారి 516ఈలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలన్నారు. నిమ్మలపాలెంలో డైవెర్షన్ రహదారి విస్తరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ మొటట్టం నూకరాజు, టీడీపీ నాయకులు దేశగిరి గోవిందరావు, ముర్ల కోటేశ్వరరావు, ఎంవీవీఎస్ ప్రసాద్, మామిడి నాగేంద్ర, రామకృష్ణ, బేరా సత్యనారాయణ పడాల్ పాల్గొన్నారు.

పాడేరులో ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడి పర్యటన

పాడేరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు బుధవారం జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక పాతపాడేరులోని ప్రా థమిక పాఠశాల, మోదకొండ మ్మ వీధిలో అంగన్‌వాడీ కేంద్రం, స్థానిక పౌరసరఫరాల శాఖ గో దాములను ఆయన తనిఖీలు చేశారు. పలు రికార్డులను కాంతారావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మోహనరావు, డీఈవో బ్రహ్మాజీరావు, సివిల్ సప్లై డీటీ ప్రశాంత్, ఫుడ్ సేఫ్టీ అధికారి గ్రీష్మ, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి. లీగల్ మెట్రాలజీ అధికారి అనురాధ, ఎంఈవో సరస్వతి, లైజనింగ్ అధికారి తేజ పాల్గొన్నారు.

జలవిహారి వద్ద ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాపరాయి జలవిహారి పర్యాటక ప్రాంతంలో రానున్న పర్యాటక సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ నియంత్రణ, టూరిస్టుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చాపరాయి జలవిహారి మేనేజర్ అప్పారావును స్థానిక ఎస్ఐ పాపినాయుడు కోరారు. ముఖ్యమైన మార్గాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

15న మండల సమావేశం

డుంబ్రిగుడ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 15న సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ఈశ్వరి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎన్‌వీవీ నరసింహమూర్తి తెలిపారు. ప్రజా ప్రతినిధులు సమావేశంలో తప్పక హాజరుకావాలని కోరారు. అధికారులు పూర్తి వివరాలతో రావాలన్నారు.

పశు సంపద నష్టంపై తహశీల్దార్‌కు నివేదిక



తహశీల్దార్‌కు వివరాలందిస్తున్న పశువైద్యాధికారి గణేశ్వరరావు

అనంతగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరదలతో పశు సంపదను నష్టపోయిన రైతులకు సంబంధించి వివరాలపై తహసీల్దార్ వీరభద్రచారికి పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందించారు. 24 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో గత నెలరోజులుగా గిరిజనులకు చెందిన అనేక పశువులు మృత్యువాతపడ్డాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించామని వివరించారు. నష్టపరిహారం చెల్లింపుపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తహసీల్దార్‌ను ఆయన కోరారు.

అంధకారంలో చినకోనెల

▸▸ ఆరునెలల కిందట విద్యుత్ సౌకర్యం

▸▸ రెండు నెలలుగా పనిచేయని ట్రాన్స్‌ఫార్మర్

అనంతగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి పంచాయతీ చినకోనెల గ్రామంలోని గిరిజనులు రెండునెలలుగా అంధకారంలో మగ్గుతున్నారు.. ఎన్నోఏళ్ల పోరాటం ఫలితంగా గ్రామానికి సుమారు 6 నెలల క్రితం విద్యుత్ సౌకర్యం కల్పించారు.. అయితే, ట్రాన్స్‌ఫార్మర్ రెండు నెలల కిందట కాలిపోయింది. అప్పటినుంచీ విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు వాపోతున్నారు. దీంతో గిరి శిఖర గ్రామం కావడంతో అడవి జంతువులు, పాములు, కీటకాల నుంచి నుంచి భయాందోళన చెందుతున్నారు. కిరోసిన్ దీపాల వెలుగులో రాత్రుళ్ల గడపాల్సి వస్తోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం అర్ధరాత్రి కాగడాలతో నిరసన చేపట్టారు.స్పందించపోతే కాశీపట్నం సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపడతామని గ్రామస్థుడు సింహాచలం, గంగులు, సీపీఎం నేత గోవిందరావు తెలిపారు.

విద్యుత్ సౌకర్యానికి దూరంగా గూడెం

అనంతగిరి: రొంపల్లి పంచాయతీ గూడెం పీవీటీజీ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.ప్రస్తుతం నూనె దీపాలతో కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామంలో 18 కుటుంబాలు చీకట్లో కష్టాలు పడుతున్నాయి.



కాగడాలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

దసరా ఉత్సవాలకు పందిరిరాట



జి.మాడుగుల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ కూడలిలో బుధవారం దసరా ఉత్స వాలకు పందిరిరాటను ప్రతిష్ఠించారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వరకు శరన్నవరాత్రులు నిర్వహిస్తారు.

అన్న సమారాధన

సీలేరు, సెప్టెంబరు 10 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో బుధవారం స్థానిక అయ్యప్పస్వామి ఆల య ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వినాయక నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు.



కొత్తకోట పీహెచ్‌సీవో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచండి

» డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి

రావికమతం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న బయోమెడికల్ వెహికల్ వేస్ట్, ఆసుపత్రిలో పరిశుభ్రత, కంట్రోల్ పాయింట్స్ ల్యాబ్‌ను తనిఖీలు నిర్వహించారు. అలాగే రోగుల గదులు, పడకలు, మరుగుదొడ్లను పరిశీలించారు. రోగులు ఉండే గదులు, మరుగుదొడ్లను మరింత పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రవితేజ, ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, సిబ్బంది తులసి, ఎర్రమ్మ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ



విద్యార్థులతో మాదక ద్రవ్యాల పై ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులతో నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి అయ్యన్న కాలనీ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మత్తు పదార్థాలు నిరోధించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి



ఉపాధ్యాయులను సత్కరించిన ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసులునాయుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిని అంకిత భావంతో నిర్వహించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు సూచించారు. నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో డీఎస్సీలో అర్హత సాధించి, ఉపాధ్యాయ వృత్తిని చేపడుతున్న 110 మందిని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టబోతున్న వారిని అభినందించారు. అనంతరం ఆయన చిత్తశుద్ధితో పనిచేస్తూ విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, మండల శాఖ అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు, సెక్రటరీ జీవీ.రమేశ్, ఎంఎస్ ప్రసాద్, అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కేంద్రానికి రావికమతం చెత్త



రావికమతంలో చెత్తను కాపులుప్పాడ విద్యుత్ కేంద్రానికి తరలిస్తున్న అధికారులు

రావికమతం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పేరుకు పోయిన చెత్తను కాపులుప్పాడ జిందాల్ విద్యుత్ కేంద్రానికి తరలిస్తున్నారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం రెండు లారీలతో చెత్తను తరలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామస్వామి మాటాడుతూ రావికమతంలో చెత్త శాశ్వత నిల్వకు డంపింగ్ యార్డు లేక తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి అన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడంతో ఇక్కడ చెత్తను తాత్కాలికంగా జిందాల్ విద్యుత్ కేంద్రానికి తరలింపునకు పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి అనుమతులు వచ్చాయన్నారు. అవాసాల మధ్య చెత్త పేరుకు పోవడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పంచాయతీకి కొంత భారమైనప్పటికీ లారీలతో పంపేందుకు చర్యలు చేపట్టామి ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంజి మోదు నాయుడు, తహశీల్దార్ అంబేడ్కర్, కార్యదర్శి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు



అర్జాపురం వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

రావికమతం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అత్యంత మహిమాన్వితమైన టి.అర్జాపురం బాల వర సిద్ధి వినాయకుని ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకష్టహర చతుర్ది శుభ పర్వదినం, భాద్రపద మాసం, కృష్ణ పక్షం సందర్భంగా బుధవారం లోక కల్యాణం కోసం సకల అరిష్టాలు తొలగి శాంతియుతంగా ఉండాలని, వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని పూజలు చేశారు. ఆలయ అర్చకులు గుంటూరు లక్ష్మణరావు, రామారావుల ఆధ్వర్యంలో శాంతి హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలపై సచివాలయ ఉద్యోగుల వినతి

మాడుగుల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాల ఉద్యోగులు పలు సమస్యలపై బుధవారం ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ గోపాలరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక సూచనల మేరకు మండలంలోని గ్రామ సచివాలయాల ఉద్యోగులు సమస్యలు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి తమకు విముక్తి కల్పించాలని, గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని అభ్యర్థించారు. కార్యాలయ పని వేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, సెలవులు, పండుగలు, ఆదివారాల్లోను బలవంతపు పనులు చేయించరాదని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్‌లు మంజూరు చేయాలని, ఆరు సంవత్సరాల పాటు ఒకే క్యాడర్‌లో పనిచేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

యూరియాపై రైతులు ఆందోళన చెందొద్దు

» రైతులకు సరిపడా ఎరువులు సరఫరాకు సిద్ధం

» ప్రతిపక్షాల ఆరోపణలు నమ్మొద్దు

» పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకట చినబాబు

మాకవరపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూరియా గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తామరం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకట చినబాబు స్పష్టం చేశారు. బుధవారం తామరం పీఏసీఎస్‌లో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ మోతాదులో యూరియాను వాడాలన్నారు. ప్రస్తుతం వరి పొలాలకు ఎకరాకు 25 కిలోల చొప్పున మూడు విడతల్లో యూరియాను వేయాలన్నారు. అలాగే మండలానికి 266 టన్నులు యూరియా అవసరం కాగా, ఇప్పటికే 112 టన్నుల యూరియా పంపిణీ జరిగిందన్నారు. మరో 110 టన్నుల పంపిణీకి రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉందన్నారు. రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం సిద్ధం చేసిందని, దీన్ని రైతులకు ఎప్పుడికప్పుడు అందిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చాయిసుధ, ఈవోపీఆర్‌డీ మేరీజోన్స్, ఏవో అప్పారావు, పీఏసీఎస్ సీఈవో భూషణం, వ్యవసాయ సిబ్బంది శేషునాయుడు, మౌనిక పాల్గొన్నారు.



తామరం పీఏసీఎస్‌లో ఉన్న యూరియాను పరిశీలిస్తున్న అధికారులు



రోలుగుంట రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

యూరియా కొరత లేదు..

రోలుగుంట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచి పంపిణీ చేస్తున్నట్టు వీఆర్వో రాజులమ్మ, ఉద్యానశాఖ సహాయకులు నాగేశ్వరరావు తెలిపారు. ఎంకేపట్నంలో బుధవారం యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంకే పట్నం రైతు సేవా కేంద్రానికి 12 టన్నుల యూరియా వచ్చిందన్నారు. అవసరమైన రైతులకు పట్టాదారు పాసు పుస్తకం లేదా 1బీ, ఆధార్ ఆధారంగా పంపిణీ చేస్తున్నట్టు వారు తెలిపారు. రైతు సేవా కేంద్రంలో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా లేదని రైతులు ఆందోళన చెందవద్దని చెప్పారు. అవసరమైన వారందరికీ పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తలుపులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు త్వరలో ఉపకరణాలు

సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త రామకృష్ణనాయుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులకు త్వరలో ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేస్తామని సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త బి.రామకృష్ణనాయుడు తెలిపారు. బుధవారం నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. ఆల్మికో సంస్థకు సంబంధించి వైద్య బృందం నితిన్, పాటిల్, ఆడియాలజిస్ట్ రాజేశ్వరి, ఆప్తమాలజిస్ట్ కరుణ ఉపకరణాలు కోసం వచ్చిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి 240 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు శిబిరానికి హాజరయ్యారని తెలిపారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఉచితంగా ప్రభుత్వం ఉపకరణాలు అందజేస్తున్నదన్నారు. ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులలో శారీరక వైకల్యం ఉన్న వారికి మోటరైజ్డు బ్యాటరీ ట్రై సైకిల్, వీల్ చైర్లు, సీపీ చైర్స్, వినికిడి లోపం ఉన్న వారికి మిషన్లు, దృష్టి లోపం ఉన్నవారికి బ్రెయిలీ కిట్లు, బుద్ధిమాద్యం ఉన్న విద్యార్థులకు ప్రత్యేక బోధనోపకరణ కిట్లను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగాధర్, ఉపాధ్యాయుడు అప్పారావు, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



ఉపకరణాల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న జనం

చోడవరంలో భారీ వర్షం

చోడవరం, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో బుధవారం మధ్యాహ్నం మండలంలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకూ ఏకధాటిగా వర్షం దంచి కొట్టింది. భారీ వర్షానికి పట్టణంలోని కొత్తూరు జంక్షన్ నుంచి, పాతబస్టాండ్, చీడికాడ రోడ్డు పరిసరాల్లోని ప్రధాన రహదారి ఏరును తలపించేలా నీరు పారింది. పట్టణంలోని బాలాజీనగర్, బానయ్యకోనేరు, చీడికాడ రోడ్డులోని కాలనీల్లోని రోడ్లు కాలువలలో భారీగా నీరు పారింది.



చోడవరంలో కురుస్తున్న వర్షం... (ఇన్‌సెట్‌లో) బాలాజీ నగర్ కాలనీలో రోడ్డుపై ఏరులై పారుతున్న నీరు

మాడుగులలో తేలికపాటి జల్లులు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం తేలికపాటి జల్లులు పడ్డాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఓ మాదిరిగా ఎండ కాసింది. అనంతరం వాతావరణంలో మార్పు వచ్చింది. ఆకాశమంతా మేఘావృతమై తేలికపాటి జల్లులు పడ్డాయి. ఈవర్షం వరి పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా దుర్గాంబిక ఊరేగింపు



గుమ్మాళ్లపాడులో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

రావికమతం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మాళ్లపాడు గ్రామంలో దసరా మహోత్సవాలు పురస్కరించుకుని బుధవారం అమ్మవారి దీక్షాధారణ భక్తులు 21 రోజుల అర్ధ మండల దీక్ష ప్రారంభించారు. గ్రామంలో 25 ఏళ్లగా ప్రతీ ఏడాది లాగే ఈ ఏడాది అంగరంవైభవంగా దుర్గాదేవి పీఠం ఏర్పాటుకు గ్రామస్థులు పోలిమేరల నుంచి భారీ ఎత్తున విగ్రహాన్ని మహిళల నీళ్ల బిందెలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అంకుపాలెంకు చెందిన గురు భవానీ ఆధ్వర్యంలో అమ్మవారి పీఠాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడ 21 రోజుల పాటు భక్తులు భవానీ మాల ధారణ చేసి దీక్షలు చేస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో మహిళలు, పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని అర్ధ నగ్నంగా నిరసన

రావికమతం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ లారీల రాకపోకలతో బురదమయంగా మారిన రింగ్ రోడ్డుపై పలు గ్రామాల గిరిజనులు అర్ధనగ్నంగా కూర్చొని బుధవారం నిరసన తెలిపారు. ఈ సంద్బంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు మాట్లాడుతూ మండలంలో చినపాచిల- టి.అర్జాపురం పీఆర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న 14 కిలోమీటర్ల రింగ్ రోడ్డు బీటీ రోడ్డు నిర్మాణానికి 2023లో హై ఇంపాక్ట్ రోడ్డు నిధులు కింద రూ.6.98 కోట్లు మంజూరయ్యాయన్నారు. 2024 జనవరిలో ఈ రోడ్డు పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ గ్రావెల్, పిక్క వేసి రోలింగ్ చేశారని చెప్పారు. మరో రెండు కిలోమీటర్ల మేర కొట్నాబిల్లి-రామన్నదొరపాలెం వరకు రోడ్డు తవ్వేసి వదిలేశారన్నారు. ఆపై రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ నిలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాత కొట్నాబిల్లి, కొత్తకొట్నాబిల్లి, గదబపాలెం, రామన్నదొరపాలెం గ్రామాలకు అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి దాపురించిందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాడి బెన్నయ్య, వలసయ్య, సింహాచలం పాల్గొన్నారు.



రోడ్డుపై బురదలో అర్ధ నగ్నంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు

మహిళా స్నేహపూర్వక పంచాయతీలతో అభివృద్ధి

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా స్నేహపూర్వక పంచాయతీలు కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నదని మాస్టర్ ట్రైనర్ ఒ.మహేశ్ అన్నారు. బుధవారం జీకే వీధి, మాకవరపాలెం, నాతవరం మండలాల సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లకు ఉమెన్ ఫెండ్లీ పంచాయతీలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా స్నేహ పూర్వక పంచాయతీలలో మహిళల అభివృద్ధి, ఆరోగ్యం, పోషణ, విద్య, నైపుణ్యాలు, భద్రత, బాల్య వివాహాలు నిర్మూలన, లింగ వివక్ష, సమానత్వం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. సమాజంలో మహిళ పాత్ర మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడతామన్నారు. పాలనలో మహిళా సర్పంచులను భాగస్వామ్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం ఏవో రమణబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ మహేశ్

‘రైతులతో రాజకీయాలు చేయడం సరికాదు’

నర్సీపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులతో రాజకీయాలు చేయడం సరైంది కాదని ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి రమణ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నియోజకర్గంలో యూరియా దొరకడం లేదని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఎక్కడా యూరియా కొరత లేదని, రైతులపై సానుభూతి ఉన్నట్టు నటిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం రైతుల నుంచి కనుగోలు చేసి ధాన్యానికి డబ్బులు ఇవ్వకపోతే, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చెల్లించిందన్నారు. రైతులు గురించి మాట్లాడే అర్హత మాజీ ఎమ్మెల్యే గణేశ్‌కు లేదని 25వ వార్డు కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు కోసం చేసిన ర్యాలీలో రైతులు కనిపించలేదని, తెల్ల చొక్కాలు వేసుకున్న నాయకులు కనిపించారని ఆయన ఎద్దేవా చేశారు.



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి రమణ

చురుగ్గా శ్మశానవాటిక అభివృద్ధి పనులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని సిహెచ్.నాగాపురం గ్రామంలో శ్మశానవాటిన అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ శ్మశానవాటిక అభివృద్ధి కోసం రాష్ట్ర శాశనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో భవనం నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. త్వరలో పూర్తి స్థాయిలో పనులు పూర్తివుతాయని గ్రామ మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, టీడీపీ సీనియర్ నాయకులు బొప్పన ప్రసాద్ తెలిపారు. శ్మశానవాటిన అభివృద్ధి పనులు జరగడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



నాగాపురంలో శ్మశానవాటిక భవనం నిర్మిస్తున్న దృశ్యం

నేటి నుంచి ఉద్యోగుల సమస్యలపై నిరసన వారం

బచ్చెయ్యపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11 నుంచి నిరసన వారం కార్యక్రమాన్ని చేపడతామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేకేఎల్ఎన్ ధర్మారావు, ఎస్.దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నిరసిస్తూ ఉపాధ్యాయులంతా 11న నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతారని చెప్పారు. అలాగే 12న మండల కేంద్రాల్లో నిరసనలు, 13, 14 తేదీల్లో ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే 15న పాత తాలూకా కేంద్రాల్లోను, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని, 17న సీఎం, సీఎస్‌లకు వాట్సాప్, మెయిల్ ద్వారా వినతిపత్రాలు అందజేస్తామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల బకాయిలను వెంటనే మంజూరు చేయడమే కాకుండా సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

దొంగతనాలు, గంజాయి రవాణా అడ్డుకట్టకు సీసీ కెమెరాలు

చీడికాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలు, గంజాయి రవాణా అడ్డుకట్ట వేయడానికే సీసీ కెమెరాలు అమర్చుతున్నామని ఎస్ఐ సతీశ్ తెలిపారు. మండలంలోని బైలుపూడి, జైత వరం మూడు రోడ్ల కూడలిలో సీసీ కెమెరాలను బైలపూడి టీడీపీ నాయకులు జె.సత్యనారాయణ, గణేశ్, గాడిప్రసాదు, జనసేన మండల నాయకుడు జీవీ.మూర్తి ఆర్థిక సహాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఎస్ఐ చెప్పారు.

బుచ్చెంపేట, ఎన్.కొత్తూరు రేషన్ డిపోల్లో తనిఖీలు

రోలుగుంట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెంపేట, ఎన్.కొత్తూరు గ్రామాల రేషన్ డిపోలను తహశీల్దార్ నాగమ్మ బుధవారం తనిఖీలు చేశారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటించి లబ్ధిదారులకు అందుబాటులో ఉండి పంపిణీ చేపట్టాలని ఈ సందర్భంగా ఆమె ఆదేశించారు. దుకాణాల్లో ఉన్న బియ్యం బస్తాలను, స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రజలకు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా? లేదా? అనేది ఆరా తీశారు. వృద్ధులకు ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేస్తున్నారా? లేదా? అనేది ఆరా తీశారు. కార్యక్రమంలో వీఆర్వో పరమానందం, నూకరాజు పాల్గొన్నారు.

వినాయకుడ్ని దర్శించుకున్న గవర కార్పొరేషన్ డైరెక్టర్

చోడవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో నెలకొల్పిన భారీ వినాయకుడి విగ్రహాన్ని బుధవారం రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్ దర్శించుకుని పూజలు చేశారు. గంగాధర్ వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో పూడికతీత పనులు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో బుధవారం డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టారు. సాగరం పంచాయతీ పరిధిలోని ఘాట్‌రోడ్డు జంక్షన్‌ను రోడ్డు పక్కన డ్రైనేజీలో పూడికతీత పనులు, పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ జయమ్మ, పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ ఈ పనులు చేయించారు.

నేడు మరిడమ్మ పండుగ

గొలుగొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మరిడమ్మతల్లి పండుగను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలోని జోగంపేట, పేటమాలపల్లి, కొత్తజోగంపేట, ద్వారకానగరం గ్రామాల్లో పండుగ జరగనుంది. ఈ మేరకు వీధుల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అలాగే రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

స్పీకర్ అయ్యన్న పర్యటనను విజయవంతం చేయాలి

నాతవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం జరగనున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పర్యటనను విజయవంతం చేయాలని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ కోరారు. బుధవారం కూటమి నాయకులతో డి.యర్రవరం గ్రామంలో ఆయన పర్యటించారు. రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన బాలికల వసతి గృహాన్ని, డి.యర్రవరంలో బాలికల కోసం మరో రూ.23 లక్షలతో నిర్మించిన గ్రంథాలయాన్ని అయ్యన్నపాత్రుడు గురువారం ప్రారంభిస్తారని చెప్పారు. అలాగే మర్రిపాలెం గ్రామంలో కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహంలో టీడీపీ నేత వెలగల వెంకటకృష్ణారావు తన సొంత నిధులతో బాలికల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బెంచీలను కూడా స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ప్రారంభిస్తారని తెలిపారు. ఈ పర్యటనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి రాజాన వీరసూర్య చంద్ర, నాయకులు వి.వెంకటకృష్ణారావు, డి.యర్రవరం, బెన్నయ్యనాయుడు నేత సత్యవతి పాల్గొన్నారు.

108 అంబులెన్స్ కోసం రైతుల ఎదురుచూపులు

నాతవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 11 రోజులుగా 108 వాహనం లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వాహనాన్ని మరమ్మతుల కోసం విశాఖపట్నం తీసుకు వెళ్లినట్టు చెబుతున్నారు. వైద్య సేవలు అవసరమైనప్పుడు రోగులను నాతవరం, నర్సీపట్నం ఆసుపత్రులకు సకాలంలో తీసుకువెళ్లే సదుపాయం లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. రోగులకు వైద్య సదుపాయాలు అవసరమైనప్పుడు ఒక్కోక్కసారి నర్సీపట్నం నుంచి 108 వాహనం పంపిస్తున్నప్పటికీ, రెండు గంటల సమయం పడుతుండడంతో సకాలంలో ఆసుపత్రులకు చేరుకోలేక అవస్థలు పడుతున్నామని బాధితులు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి మరమ్మతుల కోసం 11 రోజుల నుంచి విశాఖపట్నంలో ఉంచేసిన 108 అంబులెన్స్‌ను వెంటనే నాతవరం తీసుకువచ్చి రోగులకు అందుబాటులో ఉంచాలని కోరారు.

గ్రంథాలయంలో తనిఖీలు

నక్కపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి బుర్రా కుమార్‌రాజు బుధవారం తనిఖీలు చేశారు. గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించారు. పాఠకుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పంచాయతీల నుంచి రావాల్సిన గ్రంథాలయ పన్నును సకాలంలో వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

కాజ్‌వేను పునరుద్ధరించరా?

విజయరామరాజుపేట వద్ద తాచేరుపై కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

- మూడు వారాలు దాటినా పట్టించుకోని అధికారులు
- చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తున్నదని ప్రజల ఆవేదన



విజయరామరాజుపేట వద్ద పునరుద్ధరణకు నోచుకోని కాజ్‌వే

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విజయరామరాజుపేట వద్ద తాచేరు నది వరద ఉధృతికి కొట్టుకుపోయిన కాజ్‌వేను మూడు వారాలు దాటినా అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. దీంతో మాడు గుల, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలతో పాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఇతర ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాడేరు, మాడుగుల వైపు నుంచి చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలు వడ్డాది మీదుగా ప్రయాణించేవి. కాజ్‌వే కొట్టుకుపోవడంతో చోడవరం వైపు నుంచి రావికమతం, బుచ్చెయ్యపేట, రోలు గుంట, నర్సీపట్నం వైపు వెళ్లే వాహనాలను చోడవరం మండలం గౌరీపట్నం మీదుగా మళ్లించారు. ఇక చోడవరం వైపు నుంచి మాడుగుల, పాడేరు వైపు వెళ్లే వాహనాలను చీడికాడ మండలం అప్పలరాజుపురం, మాడుగుల మండలం కేజే పురం మీదుగా మళ్లించారు. ఈ రెండు మార్గాలు చిన్నవి కావడంతో భారీ వాహనాలు ఎదురైతే తప్పుకోలేని పరిస్థితి ఏర్పడుతున్నది.

ఈ మార్గాల్లో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి రావడంతో ఆటో డ్రైవర్లు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. అంతేకాక ప్రయాణ సమయం రెట్టింపు అవుతున్నది. పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు సకాలంలో చేరుకోలేకపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, విజయరామరాజు పేట వద్ద కాజ్‌వే పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని పలు మండలాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాగా కాజ్‌వే పునరుద్ధరణ పనులపై ఆర్‌అండ్‌బీ జేఈ సత్యప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా... ప్రభుత్వం నుంచి రూ.17.5 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. టెండర్ ఖరారు కావాల్సి వుందని, అంతేకాక నదిలో వరద ఉధృతి తగ్గేవరకు పనులు చేపట్టే అవకాశం లేదని తెలిపారు.



ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించుకున్నాని అన్నారు. దీంతో చైర్‌పర్సన్ జోక్యం చేసుకొని, తప్పుచేసిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా డీఆర్‌డీఏ పీడీ శచీదేవిని ఆదేశించారు.

విద్యా, సంక్షేమ శాఖలపై అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలేదని ఆరోపించారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అరకులోయ జడ్పీటీసీ సభ్యురాలు రోష్ని మాట్లాడుతూ, ఏజెన్సీలోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న స్థానికేతర విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ స్వామినాయుడు బదులిస్తూ.. అరకులోయలోని కంఠబంసుగూడ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 100 మంది బాలికలకు హాస్టల్ ఏర్పాటు చేశామన్నారు. ఏజెన్సీలో మరికొన్ని హాస్టళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. దేవరాపల్లి మండలంలోని కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటశాలలు లేవని, వేచలం పాఠశాలలో వ్యాయామ, హిందీ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వున్నాయని జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం చెప్పగా, అనకాపల్లి డీఈవో అప్పారావు నాయుడు బదులిస్తూ.. డీఎస్సీ ద్వారా త్వరలో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీచేస్తామని, మౌలికవసతులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు మాట్లాడుతూ, మండలంలో పంచాయతీరాజ్ అధికారుల తీరు బాగాలేదని, తన గ్రామంలో 16 నెలల నుంచి రోడ్డు నిర్మాణాన్ని పెండింగ్‌లో ఉంచారని ఆరోపించారు. ప్రొటోకాల్ సమస్యపై కొంతమంది సభ్యులు మాట్లాడుతూ,మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలకు తమను ఆహ్వానించడం లేదని ఫిర్యాదు చేశారు. ప్రతి శాఖ నుంచి సభ్యులకు సమాచారం అందించాలని చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశించారు. కోరం లేకపోవడంతో 3, 6 స్థాయీ సంఘాల సమావేశాలను వాయిదా వేశారు. ఈ సమావేశంలో సీఈవో పి.నారాయణమూర్తి, పలుశాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

పీఎం-కుసుంకు భూముల సేకరణ

... 5వ పేజీ తరువాయి

సర్వే నంబరు 95లో ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అనంతరం ఈ భూమి పత్రాలను నెడ్‌క్యాప్ బృందానికి తహశీల్దార్ జి.వెంకటరమణ అందజేశారు. ఈ సందర్భంగా నానిబాబు మాట్లాడుతూ, పీఎం-కుసుం' పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వ్యవసాయ అవసరాల కోసం సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం ప్రతి మండలంలో కనీసం పది ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు ఆరు మండలాల్లో 60 ఎకరాలను సేకరించామన్నారు. ఇక్కడ రైతుల పేర్లతో సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని, ఉత్పత్తి అయ్యే విద్యుత్తును స్థానికంగా వున్న సబ్‌స్టేషన్లకు సరఫరాచేసి, అక్కడ నుంచి రైతుల వ్యవసాయ మోటార్లకు విద్యుత్‌ను ఉచితంగా అందజేస్తామని వివరించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సౌర విద్యుత్ యూనిట్ల ద్వారా 15.97 మెగావాట్ల విద్యుత్తుని గ్రిడ్‌కు అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవో పవన్‌కుమార్, డీటీ నూకరాజు, విద్యుత్ శాఖ ఏఈ నాగభూషణం పాల్గొన్నారు.

చోడవరం సబ్‌జైలు సిబ్బందికి షోకాజ్ నోటీసులు

... 5వ పేజీ తరువాయి

రోజే జిల్లా ఎస్పీ, అనకాపల్లి డీఎస్పీతోపాటు, జైళ్ల శాఖ అధికారులు ఇక్కడకు వచ్చి పరిశీలించారు. దీనిపై విచారణకు ఆదేశించారు. సబ్‌జైలు నిర్వహణలో పలులోపాలను గుర్తించిన ఉన్నతాధికారులు.. రిమాండ్ ఖైదీలు పారిపోవడంలో సిబ్బంది నిర్లక్ష్యం కూడా ఉన్నట్టు తేల్చారు. దీంతో సబ్‌జైలు సూపరింటెండెంట్ జె.బాబూరావు, దాడికి గురైన వార్డర్ వీర్రాజుతోపాటు, మరో వార్డర్‌పై జైళ్ల శాఖ అధికారులు క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించినట్టు తెలిసింది. దీనిలో భాగంగానే తొలుత షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

ఆదిగణపతికి 234 కిలోల భారీ లడ్డూ ప్రసాదం



ఆదిగణపతి విగ్రహం వద్ద ఉంచిన 234 కిలోల భారీ లడ్డూ

చోడవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సద్భావన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 63 అడుగుల భారీ ఆదిగణపతి విగ్రహానికి స్థానిక ప్రభుత్వ హైస్కూల్ 1982-83 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 234 కిలోల భారీ లడ్డూను విరాళంగా ఇచ్చారు. సుమారు లక్షా 20 వేల రూపాయల వ్యయంతో దీనిని తయారు చేయించారు. బుధవారం ఉదయం మేళతాళాలు, కోలాటాలతో ఊరేగింపుగా ఆదిగణపతి విగ్రహం వద్దకు తీసుకువచ్చి సమర్పించారు. 17వ తేదీన గణేశ నిమజ్జనం సందర్భంగా భారీ లడ్డూను వేలం వేయనున్నట్టు సద్భావన ట్రస్ట్ వ్యవస్థాపకుడు రాజేశ్ కొప్పాక తెలిపారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల డేవిడ్, శరగడం సాయికృష్ణ, గోపి, అత్తిలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్- సూపర్ హిట్ సభలో జిల్లా నేతలు



సూపర్ సిక్స్- సూపర్ హిట్ బహిరంగ సభ వద్ద సీఎం చంద్రబాబు నాయుడుకు నమస్కరిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర



సభకు హాజరైన కార్పొరేషన్ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, పీలా గోవింద సత్యనారాయణ, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

అనకాపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం జరిగిన సూపర్ సిక్స్- సూపర్ హిట్ బహిరంగ సభకు జిల్లాకు చెందిన టీడీపీ నేతలు హాజరయ్యారు.

ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు హాజరయ్యారు.

కేజీబీవీల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)లో పది, ఇంటర్ తరగతుల్లో శత శాతం ఫలితాలు సాధించాలని సమగ్రశిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఆదేశించారు. చైతన్యనగర్‌లోని కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల సమగ్రశిక్షా అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, జీసీడీవోలు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శత శాతం ఫలితాలకు విద్యాపథకం అమలుచేయాలన్నారు. బాలికలకు అసౌకర్యం కలగకుండా, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏపీసీలు, జీసీడీవోలు ప్రతిరోజు ఒక కేజీబీవీను సందర్శించి వసతులు మెరుగపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం చివరికి కేజీబీవీల్లోని సివిల్ పనులు పూర్తిచేయాలని స్పష్టంచేశారు. రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు విద్యార్థినుల ఆరోగ్యం, మానసిక స్థైర్యం, ఒకేషనల్ విద్యపై వివరించారు. సకాలంలో సిలబస్ పూర్తిచేయాలని, ఇంకా ఇతర కార్యక్రమాలు, సెల్ఫ్ డిఫెన్స్ అమలు చేయాలని, స్వచ్ఛమైన వాతావరణంలో, మంచి పోషకాలతో కూడిన భోజనం అందించాలన్నారు. సమీక్షలో కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి, చీఫ్ ఇంజనీరు రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

పరిస్థితి విషమంగా వున్నట్టు తెలిసింది. క్షతగాత్రులను 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. భారీ వర్షం కురుస్తుండడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



మృతిచెందిన రైతు కంచర్ల రామారావు

రావికమతం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట మండలం పెదమదీనకు చెందిన కంచర్ల రామారావు (68)కు రావికమతం మండలం గుడ్డిపలో వ్యవసాయ భూములు వున్నాయి. బుధవారం సాయంత్రం పొలంలో పనులు ముగించుకొని మోపెడ్ వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఇతని ముందు ఆర్టీసీ బస్సు వెళుతున్నది. గొంప జంక్షన్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఆగింది. ఈ విషయాన్ని గమనించని రామారావు.. బస్సును వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. పెద్ద శబ్దం రావడంతో బస్సు డ్రైవర్, కండక్టర్ కిందకు దిగి చూశారు. రోడ్డుపై పడి వున్న రామారావును చికిత్స నిమిత్తం రావికమతంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రఘువర్మ తెలిపారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

రాయి క్వారీలు ధారాదత్తం

... 5వ పేజీ తరువాయి

అవసరం అయ్యాయ. గత కొంతకాలంగా జిల్లాలోని వివిధ మండలాల్లో వున్న నల్లరాయి క్వారీల నుంచి భారీ బండరాళ్లను ఎన్ఏవోబీకి తరలిస్తున్నారు. ఇంకా బండరాళ్లు అవసరం వుండడంతో కూటమికి చెందిన ఇద్దరు ముఖ్య నేతలు పక్కా ప్రణాళికతో తాము అనుకున్న వ్యక్తికి చెందిన మైనింగ్ సంస్థకు లీజులు కట్టబెట్టినట్టు సమాచారం. అయితే దీనిపై కొంతమంది సీఎంఓకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ మేడ పైనుంచి పడి వృద్ధుడి మృతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోట్నివీధికి చెందిన ఓ వృద్ధుడు మంగళవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తూ మేడ పైనుంచి పడి మృతి చెందాడని పట్టణ ఏఎస్ఐ బి.రామ్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి బుధవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. స్థానిక కోట్నివీధికి చెందిన కోరుకొండ సూర్యనారాయణ(79) మంగళవారం రాత్రి పదకొండున్నర గంటల సమయంలో మేడ పైనుంచి దిగే క్రమంలో సరిగా చూపు కనిపించక ప్రమాదవశాత్తూ కింద పడిపోయాడు. పెద్ద శబ్దం రావడంతో కుటుంబసభ్యులు, స్థానికులు బయటకు వచ్చి చూసేసరికి సూర్యనారాయణ కింద పడి తీవ్ర గాయాలతో ఉన్నాడు. వెంటనే ఆ వృద్ధుడిని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుని భార్య నారాయణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

మృతుని వివరాలు లభ్యం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో గల విశాఖ డెయిరీ పాల కేంద్రానికి చెందిన డాబాపై మంగళవారం అనుమానాస్పదంగా మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి వివరాలు లభ్యమయ్యాయని ఏఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. మృతుడు అదే గ్రామానికి చెందిన కలిగట్ల నాగేశ్వరరావు అలియాస్ నగేశ్(40)గా గుర్తించామన్నారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలిగట్ల నాగేశ్వరరావు భార్య ఐదేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి అతను మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై తిరుగుతూ చెత్త ఏరుకుని వచ్చిన డబ్బులతో మద్యం తాగి ఎక్కడబడితే అక్కడ నిద్రించేవాడు. అయితే మంగళవారం అతను మృతి చెందడంతో ఎవరూ గుర్తించలేదు. అతని దుస్తుల ఆధారంగా నాగేశ్వరరావు అని, ఐదు రోజుల క్రితం అతను మద్యం షాపు దగ్గర మద్యం సేవించడం చూశానని స్థానికుడొకరు పోలీసులకు తెలపడంతో మద్యం షాపు దగ్గర ఉన్న సీసీ కెమెరా ఫుటేజీను పరిశీలించారు. అతని కుటుంబ సభ్యుల ద్వారా నాగేశ్వరరావుగా నిర్ధారించుకున్నారు. అతను చనిపోయిన విషయాన్ని ఎవరూ గమనించకపోవడంతో మృతదేహం పాడైపోయి గుర్తు పట్టలేని విధంగా ఉండడంతో అతను ఎవరనేది స్థానికులు తెలుసుకోలేకపోయారని ఏఎస్ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని నలుగురికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

హుకుంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంతెలి సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళుతున్న బైక్‌ను, వెనుక నుంచి మరో బైక్ ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు అందించిన వివరాలిలా వున్నాయి. హుకుంపేట మండలం తడిగిరి గ్రామానికి చెందిన అరిసెల గిరిబాబు, పూజారి సుబ్బారావు; పాతకోట పంచాయతీ పాలెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు శాంతి, నరసింగరావు వేర్వేరు బైక్‌లపై పాడేరు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామాలకు బయలుదేరారు. కొంతెలి గ్రామానికి సమీపంలోకి వచ్చే సరికి ముందు వెళుతున్న నరసింగరావు బైక్‌ను, వెనుక వస్తున్న గిరిబాబు బైక్ బలంగా ఢీకొన్నది. దీంతోఓ నలుగురూ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలో వున్న పశువుల కాపర్లు ఫోన్ చేయడంతో అంబులెన్స్ వచ్చి, క్షతగాత్రులను పాడేరు ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు.